PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 322 | విజయవాడ, మంగళవారం 24 జూన్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Tuesday 24 June 2025 | Rs

ఇరాన్‌పై అమెరికా దాడులు దుర్మార్గం
- రాష్ట్రవ్యాప్త నిరసనలకు వామపక్షాల పిలుపు
- రేపు విజయవాడలో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి


2



రసపట్టులో తొలిటెస్ట్ 8
కెఎల్ రాహుల్, పంత్ సెంచరీలు ● ఇంగ్లండ్ లక్ష్యం 370 పరుగులు

ఊహించిన దానికంటే ఏడాదిలో ఎక్కువే చేశాం!

అధికారులు-ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలి
ఐఎఎస్‌లు 'బంగారు కుటుంబాలు'ను దత్తత తీసుకోవాలి
'సుపరిపాలనలో తొలి అడుగు' లో సిఎం చంద్రబాబు



సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
తమ ప్రభుత్వం ఏడాదిలోనే అన్నీ చేశామని చెప్పడం లేదని, కానీ ఊహించిన దానికంటే ఎక్కువే చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం సచివాలయం సమీపంలో సోమవారం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్-6తో పాటు మరికొన్ని ఎన్నికల హామీలు ఇచ్చామని, వీటి అమలుపై సమీక్ష చేసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల ముందు పార్టీలు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం, అధికార యంత్రాంగంపై ఉంటుందన్నారు. దీనినే పొలికటికల్ గవర్నెన్స్ అంటారని, ఇది ఉంటేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. ప్రభుత్వంపై ప్రజల్లో ఆశలు చాలా ఉన్నాయన్నారు. ప్రజలు కూటమిపై పెట్టుకున్న ఆకాంక్షలు నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. డబుల్ ఇంజిన్ సర్కారుతో ఎంత అభివృద్ధి జరుగుతుందో చేసి చూపిస్తున్నామన్నారు. కేంద్రం సహకారం లేకుంటే ఊపిరి కూడా పీల్చుకోలేని పరిస్థితి నెలకొందని చెప్పారు. ఇందుకోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు. అందరి ఉమ్మడి లక్ష్యం 2029 - 2047 కావాలని పిలుపునిచ్చారు. ఆర్థిక అసమానతలను తగ్గించేందుకే పి4 విధానమని చెప్పారు. పి4 తో 87,226 బంగారు కుటుంబాలను గుర్తించి వారి అభివృద్ధి బాధ్యతను 7,867 మంది మార్గదర్శకులకు అప్పగించామన్నారు. పి4లో భాగంగా ఐఎఎస్ అధికారులు బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని వాళ్ల ఉన్నతికి కషి చేయాలని చెప్పారు. ఎట్టిపరిస్థితుల్లో 15 శాతం వృద్ధి రేటు సాధించాలని, నిర్ధిష్ట లక్ష్యాలతో ముందుకెళ్లాలని అన్నారు. గత ప్రభుత్వం చేసిన విధ్వంసం వల్ల రాష్ట్రం నుంచి పెట్టుబడిదారులు వెళ్లిపోయారని విమర్శించారు. రాష్ట్రంపై పారిశ్రామిక వేత్తల్లో నమ్మకం పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదాయం పెంచకుండా అప్పులు తెచ్చి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తానంటే ఎక్కడి నుంచి డబ్బులు వస్తాయని ప్రశ్నించారు. ఆదాయాన్ని పెంచుకుని అభివృద్ధి చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని అన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు చూసి 2022-2023లో అప్పులు చేసే అవకాశం లేదని నీతి ఆయోగ్ రిపోర్టు కూడా ఇచ్చిందన్నారు.

పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని, ఈ ప్రాజెక్టు పూర్తయితేనే చాలా వరకు సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. అధికారంలోకి రాగానే 4 కీలక హామీలపై సంతకాలు చేశానని గుర్తు చేశారు. ఎంతమంది పిల్లలున్నా తల్లికివందనం ఇస్తామన్న హామీని అమలు చేశామన్నారు. మహిళలకు ఉచిత బస్సును కూడా ఆగస్టు 15 నుంచి అమలు చేస్తామన్నారు. విజయవాడ, విశాఖపట్నంలో మెట్రో నిర్మాణానికి కేంద్రం కూడా ఆమోదం తెలిపిందన్నారు. గత ప్రభుత్వం 95 కేంద్ర ప్రాయోజిత పథకాలు రద్దు చేసిందని, వాటిల్లో 82 పథకాలు తిరిగి ప్రారంభించామని వివరించారు. పెట్టుబడిదారుల నుంచి ఏ అభ్యర్థన వచ్చినా ఆలస్యం చేయకుండా అనుమతులు ఇచ్చి ప్రోత్సాహకాలు అందిస్తున్నామని చెప్పారు. . ల్యాండ్ రికార్డులను సరి చేసి, అర్హులకు న్యాయం జరిగేలా చూడాలని వెల్లడించారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాలు బాగుపడాలంటే గోదావరి నీళ్లను రెండు రాష్ట్రాలు వాడుకోవాలని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం 100 పడకల ఆస్పత్రుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, దీనికి ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. పేదలను ఆదుకునే బాధ్యతను ప్రభుత్వంతో పాటు.. సంపన్నులు తీసుకోవాలి. సమాజంలోని వనరులను ఉపయోగించుకుని అభివృద్ధి చెందిన వారు పేదలను ఆదుకునే బాధ్యత తీసుకోవాలి. ఆగస్టు 15వ తేదీ నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను పీ4 పరిధిలోకి తేవాలి.' అని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోనిప్రతి ఒక్కరికి ఇంటి స్థలాన్ని అందించి, ఇళ్లు కట్టిస్తామన్నారు. అనంతరం అంతర్జాతీయ యోగాడే సక్సెస్ చేసిన వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, ఉద్యోగులను ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌తో పాటు సన్మానించారు.



ఫోర్డో అణు కేంద్రంపై మళ్లీ దాడి

అమెరికా ఎయిర్‌బేస్‌లపై ఇరాన్ ప్రతీకార దాడులు

టెల్ అవీవ్, టెహరాన్ : భూగర్భంలోని ఇరాన్ ఫోర్డో అణు కేంద్రంపై మరోసారి దాడి జరిగింది. ఆదివారం బి2 బాంబర్లతో అమెరికా మూడు అణు కేంద్రాలపై దాడులు జరిపిన నేపథ్యంలో సోమవారం ఇజ్రాయిల్ మళ్లీ ఆ కేంద్రం లక్ష్యంగా దాడులకు దిగింది. ఇరాన్ రాజధాని టెహరాన్‌లోని ఎవిన్ జైలుపై, అలాగే పారా మిలటరీ రివల్యూషనరీ గార్డ్స్‌కి చెందిన సెక్యూరిటీ హెడ్‌క్వార్టర్స్‌పైనా దాడులకు దిగినట్లు ఇజ్రాయిల్ రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇరాన్ ప్రభుత్వ టివి వర్గాలు కూడా ఈ దాడుల సమాచారాన్ని ధ్రువీకరించాయి. ఫోర్డో యురేనియం శుద్ధి కేంద్రానికి దారి తీసే మార్గాలను నాశనం చేసేందుకే దాడి జరిపామని ఇజ్రాయిల్ బలగాలు వెల్లడించాయి. ఎవిన్ జైలు గేటు వద్ద దాడి జరిగిందని ఇరాన్ ప్రభుత్వ టివి తెలిపింది. డ్రోన్లతో ఈ దాడి జరిగి వుండవచ్చని అనుమానిస్తు న్నారు. ఈ దాడులకు ప్రతిగా సోమవారం రాత్రి ఖతార్, ఇరాక్, కువైట్, బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణులతో దాడులు చేసింది. ఇస్లామిక్ రిపబ్లిక్‌కు చెందిన అణుకేంద్రాలపై 'అమెరికా నేరపూరిత, సైనిక దురాక్రమణ'కు ప్రతిస్పందనగా 'ఆపరేషన్ బెషారత్ ఫతా'లో భాగంగా ఈ దాడులు జరిపినట్లు ఇరాన్ సాయుధ దళాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఖతార్‌లోని అల్ ఉదీద్ ఎయిర్ బేస్‌తోపాటు ఇరాక్, కువైట్, బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాలపై దాడి చేసినట్లు ఇరాన్ ప్రభుత్వ టివి వెల్లడించింది. దోహాలోని అమెరికా మిలట్రీ స్థావరంపై 10 వరకూ మిస్సైళ్లను ప్రయోగించింది. తమ దాడులు ఖతార్‌తో పాటు ఇతర సోదర దేశాలను బెదిరించేందుకు కాదని, అమెరికాను హెచ్చరించేందుకేనని ఇరాన్ ప్రకటించింది.

హోర్ముజ్ జలసంధిలో ట్యాంకర్లు యూ టర్న్ !
ఇరాన్‌పై అమెరికా మిలటరీ దాడుల నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిలో రెండు సూపర్ ట్యాంకర్లు యూ టర్న్ తీసుకున్నట్లు షిప్ ట్రాకింగ్ డేటా తెలిపింది. పదిరోజులుగా చెలరేగుతున్న హింస, దాడుల్లో నౌకలు నిలిచిపోవడమో లేదా తమ ప్రయాణ మార్గాలను మార్చుకోవడమో చేస్తున్నాయి. జలసంధిలో వుండాల్సిన సమయం కన్నా ఎక్కువ సేపు నౌకలు నిలిచిపోతున్నాయని పేర్కొంది.

ప్రమాదకరమైన వైఖరి : యుఎన్ చీఫ్ గుటెరస్
ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా దాడులు పశ్చిమాసియాలో ప్రమాదకరమైన వైఖరి అని ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటానియో గుటెరస్ వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ సమాజమంతా ఏక తాటిపైకి వచ్చి ఈ యుద్ధాన్ని ఆపేం దుకు నిర్ణయాత్మకంగా వ్యవహరించాల్సి వుందని ఆయన

సిట్యుయేషన్ రూమ్‌కు ట్రంప్ 6

వైఫల్యాలను ప్రశ్నించినందుకే కేసు

- వైసిపి అధ్యక్షులు జగన్



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
ఏడాది పాలనలో కూటమి వైఫల్యాలను ఆధారాలతో సహా బయటపెట్టినందుకే తనపై కుట్రపూరితంగా కేసు నమోదు చేశారని, వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సోషల్ మీడియా వేదికగా ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. అసలు తన పర్యటనకు ఆంక్షలు పెట్టాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. టిడిపి ప్రతిపక్షంలో ఉండగా ఎప్పుడైనా భద్రత తగ్గించామా? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుడిగా తన పార్టీ కార్యకర్తల ఇంటికి వెళ్లడంలో తప్పేమీ లేదని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రికి జెడ్ ప్లస్ సెక్యూరిటీని విత్‌డ్రా చేసుకుంటామనే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందా? అని ప్రశ్నించారు. తన పర్యటన పూర్తి సమాచారం పోలీసులకు ఇచ్చామని తెలిపారు. అందుకు సంబంధించిన ప్రొటోకాల్‌ను అమలుపరచలేదని, రోప్‌పార్టీలు ఉండాల్సి ఉండగా లేవని, కనీస జాగ్రత్తలు ఎక్కడా పాటించలేదని పేర్కొన్నారు. బుల్లెట్ ప్రూఫ్ వాహనం కూడా సరైనది ఇవ్వకపోతే అనుమతితో తాను కొనుగోలు చేశానని, దానికి ప్రభుత్వ వ్యక్తే డ్రైవర్‌గా ఉన్నారని తెలిపారు. అటువంటప్పుడు మాజీ ముఖ్యమంత్రి ప్రయాణిస్తున్న వాహన భద్రత ప్రభుత్వ పరిధిలోనే ఉందని, ప్రొటోకాల్ కూడా అదేనని పేర్కొన్నారు. ఘటన జరిగిన రోజు ఎస్‌పి ఒక ప్రకటన చేసి, తరువాత మార్చారని, ఇదెలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఘటన జరిగిన తరువాత వైసిపి నాయకులు దురదృష్టకర ఘటన జరిగిందని తెలిపారని, వెంటనే వారి కుటుంబం వద్దకు వెళ్లాలని పార్టీ నాయకులను పురమాయిం చానని తెలిపారు. రూ.10 లక్షల ఆర్థికసాయం చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఒక మనిషిని కోల్పోయిన కుటుంబం పట్ల చేతనైనంత మేర బాధ్యతను నిర్వర్తించామని వివరించారు. గతంలో ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబు పర్యటన సమయంలో ప్రజలు, కార్యకర్తలు చనిపోయారని, అలాంటి మీరు మానవత్వం గురించి, నైతికత గురించి మాట్లాడటం సరికాదని ఎక్స్‌లో పేర్కొన్నారు.



వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల నిబంధనల్లో సవరణ

- జిఓ 6 విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియలో ప్రభుత్వం సడలింపునిచ్చింది. ఈ మేరకు సోమవారం జిఓ ఎంఎస్ నెంబరు 6ను విడుదల చేసింది. ఇంతకుముందు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీకి సొంత మండలాన్ని పరిగణనలోకి తీసుకోవాలని మార్గదర్శకాలు ప్రభుత్వం విడుదల చేసింది. మున్సిపల్ కమిషనర్ల నుంచి వచ్చిన వినతుల మేరకు పట్టణ ప్రాంతాల్లోని వార్డు సచివాలయ ఉద్యోగులకు సొంత వార్డు కాకుండా ఇతర వార్డుల్లోకి బదిలీలు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

ఇ-స్టాంపులు ట్యాంపర్

- కాంట్రాక్టు పనుల సెక్యూరిటీ, కొల్లేటరల్ బాండ్లలో అవకతవకలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి
రిజిస్ట్రేషన్ పత్రాల్లో ఎటువంటి అక్రమాలకు తావులేకుండా చేయవచ్చునని రాష్ట్ర ప్రభుత్వం 2023లో ఇ-స్టాంపు విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. అయితే ఇందులోనూ ట్యాంపరింగ్ చేసి కోట్లాది రూపాయలు డబ్బులు చెల్లించకుండానే మోసం చేసిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. కాంట్రాక్టు పనులకు సంబంధించి బ్యాంకు సెక్యూరిటీ, కొల్లేటరల్ కోసం తీసే బాండ్ పేపర్ల జారీలో అవకతవకలు జరిగినట్టు తెలుస్తోంది. అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబుకు సంబంధించిన ఎస్ఆర్ ఇన్‌ఫ్రా ప్రయివేటు లిమిటెడ్ సంస్థలో ఈ రకమైన మోసం జరిగింది. అయితే ఈ విషయం తమకు తెలి యదనీ వెండర్ ఈ మోసానికి పాల్పడ్డాడని ఎస్ఆర్ సంస్థ ఈనెల 22వ తేదీన అనంతపురం నగరంలోని టుటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇందులో వెండర్‌గానున్న కట్టా భార్గవి, ఆమె భర్త బోయ యర్రప్ప అలియాస్ మీసేవా బాబు, వారి వద్ద పనిచేసే మోహన్‌బాబు అనే వ్యక్తిపై ఫిర్యాదు చేశారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.



ఎంఎల్‌ఎ సురేంద్రబాబుతో నిందితుడు మీసేవా బాబు

స్టాక్ హోల్డింగ్ ప్రయివేటు లిమిటెడ్ తనిఖీలో ముందే తేలిందా ?
ఇ-స్టాంపింగ్ విధానాన్ని అమలు జరిపే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం స్టాక్ హోల్డింగ్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థకు అప్పగించింది. సాంకేతికపరమైన అంశాలన్నింటినీ ఆ సంస్థ పర్యవేక్షిస్తుంది. ఆ సంస్థ పరిశీలనలోనే ఎస్ఆర్ ఇన్‌ఫ్రాకు సంబంధించి సెక్యూరిటీ- కొల్లేటరల్‌కు సంబంధించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన స్టాంపు డ్యూటీలో వ్యత్యాసాలున్నట్టు గుర్తించినట్టు సమాచారం. ఆ సంస్థ ద్వారా సమాచారం అందుకున్న తరువాత ఎస్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థ ఈ నెల 22న ఈ వ్యత్యాసాల్లో తమకు సంబంధం లేదని స్టాంపులను వెండర్ ట్యాంపరింగ్ చేసినట్టు చెబుతోంది. అంతేకాకుండా తమ ఇంటర్నల్ అడిటింగ్‌లోనూ ఈ విషయాలు తెలుసుకుని ఫిర్యాదు చేస్తున్నట్టు పేర్కొంది. అయితే దీనికి సంబంధించి ఒక లక్ష రూపాయల విలువైన వ్యత్యాసాన్ని మాత్రమే చూపించింది. తక్కిన వివరాలేవి అందులో పొందుపరచలేదు.

ట్యాంపరింగ్ ఇలా జరిగింది
ఎస్ఆర్ సంస్థ రాష్ట్రంతోపాటు, ఇతర రాష్ట్రాల్లోనూ పెద్దఎత్తున నేషనల్ హైవేస్, ఇరిగేషన్ పనులను చేపడుతోంది. ఈ పనులు చేపట్టే సమయంలో ఇవ్వాల్సిన బ్యాంకు సెక్యూరిటీస్, కొల్లేటరల్‌కు రూ. లక్షల విలువ చేసే నాన్ జ్యూడిషియల్ స్టాంపులు తీయాల్సి ఉంటుంది. ఇలా తీసే క్రమంలో లక్ష రూపాయల విలువైన పత్రాలు తీయాల్సిన చోట వంద రూపాయలకే తీసి, దానికి అదనంగా సున్నాలు చేర్చి విలువను పెంచి అధికారిక పత్రాల్లో పొందుపరిచారు. ఈ రకంగా కొన్ని వందల పత్రాలు మూడు సంవత్సరాల్లో లావాదేవీలు జరిగాయి. అయితే ఈ విషయం తమకు తెలియదని ఎస్ఆర్ సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. తమకు తెలియకుండా వెండర్ చేసాడని చెబుతున్నారు.

ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడే మీసేవా బాబు
డబ్బుల చెల్లింపుల్లో వెండర్‌ది మాత్రమే తప్పుందని ఎస్ఆర్ ఇన్‌ఫ్రా చెబుతున్న వాదనలపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వెండర్ అయిన కట్టా భార్గవి భర్త బోయ యర్రప్ప అలియాస్ మీసేవా బాబు... ఎమ్మెల్యే సురేంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు. నియోజకవర్గంలోని మిగతా 7లో

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు



విజయవాడ ధర్నాచౌక్‌లో మాట్లాడుతున్న అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - యంత్రాంగం
సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, వేతనాలు పెంచాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద అంగన్‌వాడీలు ధర్నాలు చేశారు. తమ సమస్యలపై నినదించారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం చేపట్టారు.

విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ మాట్లాడుతూ.. అంగన్‌వాడీలందరూ పేద కుటుంబాలకు చెందిన వారేనని, పేద, గర్భిణి, బాలింతలు, చిన్న పిల్లలకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు మినీ వర్కర్లు అనేక సేవలందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు కావడంతో వారికి సంక్షేమ పథకాలు దక్కడం లేదన్నారు. అంగన్‌వాడీ పిల్లలకు తల్లికి వందనం, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, మినీ వర్కర్ల జిఓ ఇవ్వాలని, రేషన్ కార్డులివ్వాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే పక్షంలో కనీస వేతనం మిగతా 7లో

ఐదు నెలల గరిష్టానికి చమురు ధరలు

- హర్మూజ్ జలసంధి మూసివేస్తే మరింత పెరిగే అవకాశం

ముంబయి : పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా దాడులు చేయడంతో క్రూడ్ ఆయిల్ ధరలు ఐదు నెలల గరిష్టాలకు చేరాయి. సోమవారం ముడి చమురు బ్యారెల్ ధర 2.7శాతం పెరిగి 79.12 డాలర్లకు చేరింది. అమెరికా క్రూడ్ బ్యారెల్ ధర 2.8శాతం ఎగిసి 75.98 డాలర్లుగా నమోదయ్యింది. అమెరికా దాడుల తర్వాత హర్మూజ్ జలసంధిని మూసివేయడానికి ఇరాన్ పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఈ జలసంధి నుంచే ప్రపంచానికి అవసరమయ్యే మొత్తం చమురులో దాదాపు 24 శాతానికిపైగా సరఫరా అవుతుంది. ఉద్రిక్తతలు ఎక్కువ కాలం కొనసాగితే చమురు ధరలు మరింత ఆందోళనకర స్థాయికి పెరగొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారతదేశ ముడి చమురులోనూ దాదాపు 45 నుంచి 50 శాతం వరకు హర్మూజ్ జలసంధి ద్వారా వస్తుంది. హర్మూజ్ జలసంధి ద్వారా చమురు ప్రవాహం ఒక నెల పాటు సగానికి తగ్గితే బ్రెంట్ క్రూడ్ ధర ఒక్కసారిగా 110 డాలర్లకు చేరుకుంటుందని గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేసింది.

రాజధానిలో బిజెపికి రెండెకరాలు

- ఆరు సంస్థలకు భూ కేటాయింపులు
- మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం

అమరావతి బ్యూరో:రాజధాని పరిధిలో రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం భూ పందేరం గావించింది. అందులో భాగంగా బిజెపి కార్యాలయానికి రెండెకరాలు కేటాయించింది. అలాగే అమరావతిలో కొత్తగా ఆరు సంస్థలకు భూములు కేటాయిస్తూ మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుంది. గతంలో భూములు పొందిన నాలుగు సంస్థలకు ఇచ్చిన విస్తీర్ణంలో మార్పులు చేసింది. రెండు సంస్థలకు రద్దు చేసింది. సోమవారం ఉదయం వెలగపూడి సచివాలయంలో రాజధానిలో భూముల కేటాయిం పులకు సంబంధించి మంత్రివర్గ ఉపసంఘం 18వ సమావేశం జరిగింది. దీనికి పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ, పరిశ్రమల మంత్రి టిజి భరత్ హాజరయ్యారు. మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్ ఆన్‌లైన్లో పాల్గొన్నారు. అనంతరం వివరాలను మంత్రి నారాయణ మీడియాకు వివరించారు. మొత్తం 16 అంశాల ఎజెండాలో 12 అంశాలకు సబ్ కమిటీ ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్టుమెంట్, ఎపి గ్రామీణ బ్యాంకుకు రెండెకరాల చొప్పున కేటాయించారు. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు 40 సెంట్లు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి)కి 50 సెంట్లు, బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్‌కు 50 సెంట్లు కేటాయించారు. 2014-17 మధ్య కాలంలో 130 సంస్థలకు 1,270 ఎకరాలు కేటాయించగా, గత ప్రభుత్వం నిర్వాకంతో పలు సంస్థలు వెనక్కు వెళ్లిపోయాయని తెలిపారు. ఆయా సంస్థలతో సంప్రదింపులు జరిపి తిరిగి కేటాయింపుల విషయంలో నిర్ణయం తీసు కుంటున్నామని మంత్రి వివరించారు. భూములు పొందిన సంస్థలు వీలైనంత త్వరగా వాటి నిర్మాణాలు పూర్తి చేస్తాయని వివరించారు. అమరావతిలో ఇప్పటికే పదివేలమందికిపైగా కార్మికులు పనుల్లో ఉన్నారని, వర్షాలు తగ్గుముఖం పట్టేనాటికి 20 వేలమంది కార్మికులతో పనులు శరవేగంగా కొనసాగుతాయని మంత్రి నారాయణ తెలిపారు. అలాగే 2014-19 మధ్యకాలంలో భూములు కేటాయించిన పలు సంస్థలకు తిరిగి కేటాయింపుల్లో మార్పులు చేస్తూ సబ్ కమిటీ ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు రెండెకరాల చొప్పున కేటాయించారు. స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు ఐదెకరాలు, ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్‌కు మూడు ఎకరాలను కేటాయింపు కొనసాగింపునకు అనుమతినిచ్చారు. ఈ నాలుగు సంస్థలకు గతంలో కేటాయింపు జరిపిన విస్తీర్ణంలో స్వల్ప మార్పులు చేశారు. గెయిల్ ఇండియా, అంబికా అగర్‌బత్తి సంస్థలకు గతంలో కేటాయించిన భూములను రద్దు చేశారు.

రైతులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

- అఖిలపక్ష సమావేశంలో వక్తలు



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నెల్లూరు జిల్లా, రామాయపట్నం మండలం, ఉలవపాడు భూముల కోసం పార్టీలకు అతీతంగా రైతులంతా ఐక్య పోరాటాలు చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆమ్‌ఆద్మీ పార్టీ ఆధ్వర్యాన విజయవాడలోని ప్రెస్ క్లబ్‌లో ఉలవపాడు భూసేకరణపై సోమవారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్ అధ్యక్ష వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఉలవపాడు మామిడితోటల భూసేకరణను సిపిఎం వ్యతిరేకిస్తోందని చెప్పారు. భూసేకరణ పేరుతో పేదల ఇళ్లను, గ్రామాలను అడ్డగోలుగా మార్చే విధానాన్ని చూస్తూ ఊరుకునేది లేదన్నారు. పేదల భూములను అడ్డగోలుగా భూ బ్యాంక్‌లుగా మార్చడం ఈ ప్రభుత్వానికి మంచిది కాదని హితవు పలికారు. అభివృద్ధి అంటే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లేకుండా చేసి కేవలం ఒకరిద్దరికి భూములు కట్టబెట్టడమేనా? అని ప్రశ్నించారు. వ్యవసాయ భూములను ఇలా నాశనం చేసుకుంటూ పోతే భవిష్యత్తులో ప్రజలు ఏం తిని బతకాలి? అని ప్రశ్నించారు. సిపిఎం పార్టీగా రైతులకు ఎప్పుడూ అండగా ఉంటామని పేర్కొన్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. చంద్రబాబుకు పచ్చని పంట పొలాలు అంటే అంత ద్వేషం ఎందుకన్నారు. వ్యవసాయం అంటే చులకన చూస్తూ, పంట పొలాలను పారిశ్రామికాభివృద్ధి పేరుతో కార్పొరేట్లకు కట్టబెడుతున్న ఈ విధానంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవనోపాధిని దెబ్బతీస్తోందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అడవికి ఇచ్చిన నిర్వచనంలో పండ్ల తోటలు కూడా వస్తాయన్నారు. కాబట్టి అడవులను లేకుండా చేసే హక్కు ఎవరికీ లేదన్నారు. ఉలవపాడు మామిడి తోటలను ఒక్క ఎకరా కూడా ప్రభుత్వం తీసుకోకూడదన్నారు. రైతులు అధైర్యపడి భూములను ఇవ్వొద్దని సూచించారు. రైతులకు రాష్ట్రం మొత్తం అండగా ఉంటుందన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య మాట్లాడుతూ.. భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చిన జిల్లా కలెక్టర్ ప్రజలను మభ్యపెట్టడానికి తప్పుడు సమాచారం ఇస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా నిర్వాసితులు ఎవరూ లేరని, సామాజిక ప్రభావాన్ని పరిశీలించాల్సిన అవసరం లేదనే విధానం చూస్తుంటే చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకుని, బ్రిటీష్ వారి తరహాలో వ్యవహరిస్తున్నట్లు ఉందన్నారు. ఆప్ నాయకులు నేతి మహేశ్వరరావు మాట్లాడుతూ.. ఒక చార్టెడ్ అకౌంటెంట్‌గా కంపెనీలు పెట్టి మూసేసిన చరిత్ర ఉన్న శిరిడి సాయి ఎలక్ట్రికల్ అధినేత విశ్వేశ్వరరెడ్డి ఫండ్ ఇవ్వగానే ఉత్తముడు అయిపోయాడా? అని ప్రశ్నించారు. రెండు లక్షల ఎకరాలను ప్రతి నియోజకవర్గం నుంచి సేకరించే విధానంతో ముందుకెళ్లడం దారుణమన్నారు. ఈ సమావేశంలో కొరివి వినయ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు సుంకర పద్మశ్రీ, ముస్లింలీగ్ నాయకులు బాజీ, రైతు నాయకులు మిరియం శ్రీనివాసులు, మాలకొండారెడ్డి, ఆర్థిక రంగ నిపుణులు ప్రొఫెసర్ శివ తదితరులు ప్రసంగించారు.

ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు

- ఎరోస్పేస్ డిఫెన్స్ పాలసీపై సమీక్షలో సిఎం
- క్లస్టర్ల వారీ పరిశ్రమలు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎరోస్పేస్, డిఫెన్స్ రంగంలో వచ్చే ఐదేళ్లలో రాష్ట్రానికి రూ.లక్ష కోట్ల పెట్టుబడులు ఆకర్షించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఎరోస్పేస్ డిఫెన్స్ పాలసీ (2025–2030)పై వెలగపూడి సచివాలయంలో సిఎం సోమవారం సమీక్ష నిర్వహించారు. ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ సలహాదారు సతీష్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రక్షణ, ఏరోస్పేస్ రంగంలో నూతన సాంకేతిక, నవీన ఆవిష్కరణలకు రాష్ట్రం కేంద్రంగా మారేలా చూడాలని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో దేశం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో టెక్నాలజీ ప్రధాన పాత్ర పోషిస్తుందని సిఎం అన్నారు. ఈ తరహా సాంకేతికతను రక్షణపరంగా వాడుకోవడంతోపాటు వాణిజ్యస్థాయిలో ఉత్పత్తి చేసి, దైనందిన జీవితకాలంలోనూ ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని సూచించారు. దేశ రక్షణ, అంతర్గత శాంతి భద్రతలకు సంబంధించి భవిష్యత్‌లో విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు నూతన పాలసీ దోహదపడాలని సూచించారు. నేషనల్ సెక్యూరిటీకి ప్రాధాన్యతలు ఇచ్చేలా పలు మార్పులు సూచించారు. ఈ రంగంలో ఎంఎస్ఎంఇలను ప్రత్యేకంగా ప్రోత్సహించి బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. దీనికోసం ఏడాదికి రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయడంతోపాటు, లాజిస్టిక్స్ సబ్సిడీ వంటివి నూతన పాలసీలో పొందుపరచాలని సూచించారు. అనుబంధ పరిశ్రమల ఉత్పత్తుల నాణ్యతలో బెంచ్‌మార్కు ఉండేలా చూడాలన్నారు. మార్కెటింగ్, బ్రాండింగ్ ముఖ్యమని, వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్‌ప్రెన్యూర్ ఆశయం సాకారం కావాలని తెలిపారు.

ప్రాంతాల వారీ క్లస్టర్లు

విశాఖపట్నం, శ్రీకాకుళంలో నావల్ క్లస్టర్, జగ్గయ్యపేట దొనకొండ ప్రాంతంలో మిస్సైల్స్, ఆయుధాల ఉత్పత్తులు, కర్నూలు ఓర్వకల్లులో మానవ రహిత విమానాలు, డ్రోన్ల తయారీ, లేపాక్షి, మడకశిర క్లస్టర్‌లో ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, తిరుపతిని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దాలని, డిఆర్‌డిఒ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నెలకొల్పాలని సిఎం సూచించారు. మడకశిర క్లస్టర్‌లో భారత్ ఫోర్జ్ ఎంఎండబ్ల్యు సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయని, త్వరలోనే శంకుస్థాపన చేయనున్నాయని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏరోస్పేస్ డిఫెన్స్ క్లస్టర్లలో 23 సంస్థలు, రూ.22 వేల కోట్ల పెట్టుబడులు పెట్టాయని పేర్కొన్నారు. దీంతో 17 వేల మందికి ఉపాధి లభించిందని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, టిజి భరత్, వాణిజ్య పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్ పాల్గొన్నారు.



సామాజిక తనిఖీల పేరుతో వేధింపులు వద్దు

- ఉపాధి హామీ సిబ్బంది డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ సిబ్బందిపై సామాజిక తనిఖీల పేరుతో ఉద్దేశపూర్వకంగా చేయని తప్పులకు రూ.లక్షల్లో రికవరీలకు ఆదేశాలు ఇవ్వడం దారుణమని, ఇటువంటి వేదింపులను వెంటనే ఆపాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ఎంప్లాయిస్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ పేర్కొంది. కమిటీ ఆధర్వంలో తాడేపల్లిలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది టిఎలు, జెఇలు, ఇసిలు, ఇతర క్యాడర్ల సిబ్బంది ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెఎసి ఛైర్మన్ ఎం.రామచంద్రయ్య మాట్లాడుతూ, మట్టిపనికి సంబంధించి సామాజిక తనిఖీలకు వారం రోజులలోపు కొలతలు తీసుకోవాల్సి ఉండగా ఏడాది తరువాత తనిఖీలు చేయడంతో కొలతల్లో వ్యత్యాసాలు వస్తున్నాయని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఎఫ్ఎల నుంచి ఎపిడిల వరకూ సామాజిక తనిఖీలో వచ్చిన అభియోగాలకు సంబంధించి కొత్త మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో వివిధ హోదాల్లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. పిఆర్‌సి 23 శాతం అమలు, జీతాల పెంపు, గ్రేడ్స్ ఫిక్సేషన్, గ్రాట్యుటీ అమలు, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని ఎఫ్‌టిఇలుగా మార్చడం, వివిధ అలవెన్స్‌లను బేసిక్ పేలో కలపడం, హెల్త్ కార్డులు మంజూరు, అర్హులైన వారికి పదోన్నతుల కల్పన వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ కృష్ణతేజ సోషల్ ఆడిట్ డైరెక్టర్ శ్రీకాంత్‌కు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపిఒల సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఇసిల సంఘం అధ్యక్షులు వెంకటాచలపతి, కంప్యూటర్స్ అపరేటర్స్ అసోసియేషన్ నాయకులు జంగా నాగేశ్వరరావు, టిఎల సంఘం నాయకులు తిరుమలేశు, సుధీర్, ఆనంద్, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో భారీగా ఐఎఎస్‌ల బదిలీలు

- సిఎంఒలోనూ మార్పులు, చేర్పులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో భారీగా ఐఎఎస్ అధికారుల బదిలీలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వారం పది రోజుల్లోగా ఈ బదిలీలు ఉంటాయని సాధారణ పరిపాలనశాఖ చెబుతోంది. కీలక శాఖల్లో కూడా కొంతమందికి స్థానచలనం తప్పదన్న భావన వ్యక్తమవుతోంది. వాస్తవానికి ఇప్పటికే బదిలీలు జరగాల్సి ఉండగా, రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన యోగా కార్యక్రమాల నేపథ్యంలో బదిలీల్లో జాప్యం జరిగినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో పనిచేస్తున్న జిల్లా కలెక్టర్ల నుంచి సచివాలయంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శుల వరకు, శాఖాధిపతుల్లో కూడా కొంతమంది బదిలీ జాబితాలో ఉంటారని చెబుతున్నారు. ప్రధానంగా మున్సిపల్, వైద్యారోగ్యశాఖ, ఆర్థికశాఖల్లో కూడా మార్పులు చేర్పులు ఉంటాయని సమాచారం. ఆర్థికశాఖలో ఇప్పటికే నలుగురు ఐఎఎస్ అధికారులు ఉన్నారు. తాజాగా ఈ శాఖ పరిస్థితిపై విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఇక కీలకమైన వైద్యారోగ్యశాఖ, మున్సిపల్‌శాఖ, మరికొన్ని ఇతర శాఖల్లో పనిచేస్తున్న వారు కూడా కనీసం తమతమ మంత్రులకు విలువ ఇవ్వడం లేదన్న ఫిర్యాదులు ఆయా శాఖల మంత్రుల నుంచే వినిపిస్తున్నాయి.

కలెక్టర్ల సదస్సు లోపలే

ఈ నెలాఖరులో గానీ, వచ్చే నెల ఆరంభంలో గానీ కలెక్టర్ల సదస్సు నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారు. ఈ లోగానే కొన్ని జిల్లాల కలెక్టర్లను కూడా మార్పుచేసి కలెక్టర్ల సదస్సులో వారిని భవిష్యత్తు కార్యాచరణపై దిశా నిర్దేశం చేయాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో స్వయంగా తన పేషీలో కూడా కొన్ని మార్పులు చేసుకోవాలని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలిసింది.

ప్రజలకు ఉపయోగపడేలా నాయకత్వం : సజ్జల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : ప్రజలకు ఉపయోగపడేలా వైసిపి నాయకత్వం పటిష్టం కావాలని, దీనిలో పంచాయతీరాజ్ విభాగం అత్యంత కీలకమని పార్టీ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. తాడేపల్లి వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన పంచాయతీరాజ్ విభాగ సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీరాజ్ విభాగం బలోపేతం అయితేనే పార్టీ మరింత పటిష్టంగా తయారవుతుందని తెలిపారు. అమరావతిలో 40 వేల ఎకరాలు చాలవన్నట్లు మరో 40 వేల ఎకరాలు సమీకరిస్తున్నారన్నారు. మొబిలైజేషన్ అడ్వాన్స్ పేరుతో దోపిడీ చేస్తున్నారని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ విభాగంలో అప్రమత్తంగా ఉండి ప్రభుత్వ వైఫల్యాలను నిలదీయాలని తెలిపారు. ఉపాధి హామీ నిధుల దోపిడీని అడ్డుకోవాలని సూచించారు.

వీడియోపై అనుమానాలున్నాయి : మనోహర్‌రెడ్డి

గుంటూరులో అభిమాని మృతిచెందిన వీడియోపై అనుమానాలు ఉన్నాయని వైసిపి లీగల్‌సెల్ అధ్యక్షులు మనోహర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రమాదం జరిగితే కార్లో ఉన్న వారందరిపై కేసులు నమోదు చేయడం చరిత్రలో ఎక్కడా జరగలేదన్నారు. రాజకీయ కక్షతోనే అక్రమ కేసులు పెట్టారని వివరించారు.



విశాఖలో యువత పోరు ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

నిరుద్యోగ భృతి ఎక్కడ?

- యువతకిచ్చిన హామీలను అమలు చేయాలి
- రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి 'యువత పోరు'

ప్రజాశక్తి-యంత్రాంగం

యువత, విద్యార్థులు, నిరుద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ వైసిపి పోరుబాట పట్టింది. ఉద్యోగం, ఉపాధి కల్పించకుండా, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం విఫలం కావడంతో ఆ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ వద్ద ఆందోళనలు నిర్వహించారు. యువతకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని వైసిపి జిల్లా కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు సుమారు 400 మంది విద్యార్థులు, నేతలు ర్యాలీగా బయలుదేరారు. కలెక్టర్ కార్యాలయం సమీపంలోకి రాగానే పోలీసులు వారిని అడ్డుకున్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వాలని నాయకులు చెప్పగా ఇంతమందికి అనుమతి లేదని, 50 మందిని మాత్రమే అనుమతిస్తామని పోలీసులు తెలిపారు. దీనిపై వైసిపి నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త గౌతమ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఇతర నాయకులు వాగ్వాదానికి దిగారు. అందరూ కలిసి కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో వారిపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. కొద్దిసేపు ఉద్రిక్తత అనంతరం కొద్ది మందిని అనుమతించడంతో నాయకులు వెళ్లి కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇచ్చారు. విశాఖ జిల్లా పరిషత్ జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగింది. ర్యాలీని పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. తరువాత నిరసనకారులు తమ ప్రదర్శనను కొనసాగించి డిఆర్‌ఒకు వినతిపత్రం సమర్పించారు.

పత్రికలు వర్తమాన అంశాలపై దృష్టి సారించాలి

- మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర, వర్తమాన అంశాలపై దిన పత్రికలు ప్రత్యేక దృష్టి సారించాలని సి.రాఘవాచారి మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్ సూచించారు. ప్రజలతో నిరంతరం మమేకమైన విశాలాంధ్ర దినపత్రిక ఎప్పటికీ ఒక అపురూపమైన పత్రికగా విలసిల్లుతోందన్నారు. విజయవాడ చంద్రం బిల్డింగ్స్‌లో విశాలాంధ్ర దినపత్రిక 73వ వార్షికోత్సవ సభ విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ.. భాషా ప్రయుక్త రాష్ట్రాల్లో విశాలాంధ్ర పత్రిక చెరగని ముద్ర వేసుకుందన్నారు. మారుతున్న సాంకేతిక రంగం, సోషల్ మీడియా విస్తృతితో పత్రికను మల్టీ మీడియా రంగం వైపునకు మళ్లించాలని ఆలపాటి సూచించారు. సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ మాట్లాడుతూ.. వాస్తవాలకు ప్రతిరూపంగా విశాలాంధ్ర నిలుస్తోందని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా తనదైన శైలిలో వామపక్ష భావజాలంతో విలక్షణమైన జర్నలిజంతో పనిచేస్తుందన్నారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నిరంతరం ప్రజాపక్షం కోసం విశాలాంధ్ర తపిస్తోందన్నారు. విశాలాంధ్ర ఎడిటర్ ఆర్‌వి రామారావు మాట్లాడుతూ.. నిరంతరం గొప్ప పత్రికగా విశాలాంధ్ర ఎదుగుతోందన్నారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి జల్లి విల్సన్ మాట్లాడుతూ.. ఎన్ని కష్ట నష్టాలు వచ్చినా తన ఆశయ సాధన కోసం శ్రమిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు, విజ్ఞాన సమితి జనరల్ మేనేజరు పి హరినాథ్‌రెడ్డి, డిప్యూటీ జిఎం టి మనోహర్‌నాయుడు పాల్గొన్నారు.

'లులూకు ప్రైవేట్ భూములు చట్టబద్ధం కాదు'

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖ పాండురంగాపురంలోని హార్బర్ పార్క్ ఎదురుగా ఉన్న 13.08 ఎకరాల భూమిని ప్రభుత్వం అనధికారికంగా లులూ సంస్థకు 99 ఏళ్లకు లీజుకు ఇవ్వడం చట్టబద్ధం కాదని, అది పూర్తిగా ప్రైవేటు, జిరాయితీ భూమి అని, దీనిపై కోర్టులో పలు పిటిషన్లు విచారణలో ఉన్నాయని స్థల యజమానులు (వారసులు)గా చెబుతున్న వారి తరపున కొంతమంది న్యాయవాదులు తెలిపారు. ఈ మేరకు ఓ హోటల్‌లో వారు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. బాధితుల తరపున ఎపి హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయవాది వాడపల్లి శివానంద్ మాట్లాడుతూ.. విశాఖ బీచ్ రోడ్డులోని సుబ్బిరామిరెడ్డి గెస్ట్ హౌస్ పక్కన ఉన్న స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా లులూ సంస్థకు కేటాయించినట్లు ప్రకటించిందని తెలిపారు. ఆ స్థలానికి పది మంది యజమానులు, వారి వారసులు ఉన్నారని, వారిని సంప్రదించకుండా, నష్టపరిహారం చెల్లించకుండా ప్రభుత్వం ఏకపక్షంగా ప్రైవేటు సంస్థకు కేటాయించడం పట్ల బాధితులు హైకోర్టులో న్యాయ పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో నాలుగు రిట్ పిటిషన్లు, సుప్రీంకోర్టులో ఒక స్పెషల్ లీవ్ పిటిషన్ వేసినట్టు పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాల్సి ఉందని, అప్పటివరకూ ఎటువంటి నిర్మాణాలూ చేపట్టడంగానీ, ఆర్థిక లావాదేవీలు జరపడంగానీ చేయరాదన్నారు. ప్రభుత్వ పెద్దల నుండి ఇప్పటికే స్థల యజమానులకు బెదిరింపులు వస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం బాధితులకు నష్ట పరిహారం చెల్లించి ఆ స్థలాన్ని తీసుకోవాలనుకుంటే ప్రభుత్వానికి ఇచ్చేందుకు స్థల యజమానులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మీడియా సమావేశంలో న్యాయవాదులు జనపాముల వెంకట కొండలరాయుడు, యెన్ని కృష్ణ, ఎల్లాపంతులు, గున్నా కామేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ ఉద్యోగులకు స్థానిక మండలాల్లోనే బదిలీ

- గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ సచివాలయ ఉద్యోగులకు స్థానిక మండలంలోనే బదిలీలకు అవకాశం కల్పించాలని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్‌డి జాని పాషా, బత్తుల అంకమ్మరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

వార్డు సచివాలయ ఉద్యోగులకు స్థానిక మున్సిపాలిటీల్లోనే బదిలీలకు అవకాశం కల్పించడం పట్ల ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఒకే శాఖకు చెందిన ఉద్యోగులకు రెండు రకాల నిబంధనలు అనేవి ఎంతమాత్రం సమంజసం కాదని, ప్రభుత్వం గ్రామ సచివాలయ ఉద్యోగులకు స్థానిక మండలాల్లో బదిలీకి అవకాశం కల్పించే విషయంలో పునరాలోచించాలని వారు విజ్ఞప్తి చేశారు.

జాతీయ టాస్క్‌ఫోర్స్‌తోరి సమన్వయం కోసం

నోడల్ ఆఫీసరుగా నారాయణ భరత్ గుప్తా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యార్థుల్లో మానసిక ఆరోగ్య సమస్యలు, విద్యా సంస్థల్లో ఆత్మహత్యల నివారణ అంశాలపై ఏర్పాటుచేసిన జాతీయ టాస్క్‌ఫోర్స్‌తో సమన్వయం చేసుకునేందుకు ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తాను నోడల్ ఆఫీసరుగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం జిఓ ఆర్‌టి నెంబరు 96ను విడుదల చేసింది.

సమ్మె నోటీస్ అందజేత

- విఆర్‌ఎల సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జులై 9న జరగనున్న దేశ వ్యాప్త సమ్మెకు మద్దతుగా ఎపి రెవెన్యూ సహాయకుల సంఘం సోమవారం సిసిఎల్ఎ జి జయలక్ష్మికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్, ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, కోశాధికారి కె రవికుమార్ మాట్లాడుతూ.. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని అన్నారు.

విఆర్‌ఎలకు టైమ్‌స్కేల్ జీతాలు చెల్లించాలని, డిఎ జీతంతో కలపాలన్నారు. నైట్ డ్యూటీలు, అక్రమ డ్యూటీలు రద్దు చేయాలని, రీ సర్వేలకు టిఎ, డిఎలు చెల్లించాలన్నారు. ప్రమాదంలో మరణించిన విఆర్‌ఎ కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలన్నారు.

ఇరాన్‌పై అమెరికా దాడులు దుర్మార్గం

- రాష్ట్ర వ్యాప్త నిరసనలకు వామపక్షాలు పిలుపు
- రేపు విజయవాడలో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇరాన్‌పై అమెరికా దాడులు దుర్మార్గమని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు పి ప్రసాద్, సిపిఐఎంఎల్ నాయకులు జాస్తి కిషోర్‌బాబు, ఎంసిపిఐయు నాయకులు కాటం నాగభూషణం, సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు బి బంగారురావు, ఎస్‌యుసిఐసి నాయకులు బిఎస్ అమర్‌నాథ్, ఫార్వార్డ్ బ్లాక్ నాయకులు పివి సుందరరామరాజు, ఆర్ఎస్‌పి నాయకులు జానకి రాములు సోమవారం ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకూ భారత్ అవలంభిస్తున్న సంప్రదాయ విదేశాంగ విధానానికి ఇది విరుద్ధమని, ఇరాన్‌పై దాడితో ఆయిల్ సంక్షోభం వస్తుందనీ, దేశ ప్రజలపై భారాలు పడతాయని తెలిపారు. భారత ప్రభుత్వం వెంటనే అమెరికా దాడులను ఖండించాలని కోరారు. ఇరాన్‌పై అమెరికా దాడులకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రేపు (25న) విజయవాడలో నిరసన కార్యక్రమం జరుగుతుందని, రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో నాయకులు తమ వీలును బట్టి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వారు పిలుపునిచ్చారు.

భారత్‌తో ఇరాన్ ఎల్లప్పుడూ స్నేహపూర్వకంగా వ్యవహరిస్తోందని, ప్రతి కష్ట సమయంలోనూ భారత్‌కు మద్దతు ఇస్తోందని తెలిపారు. ఇరాన్‌పై దాడి చేయడానికి అమెరికా పొంతన లేని సాకులు చెబుతోందని, అమెరికా ఇంటెలిజెన్స్ సంస్థలు, అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ ఇరాన్ అణ్వాయుధాన్ని తయారు చేస్తోందని తమ వద్ద నిర్దిష్ట ఆధారమేదీ లేదని అంగీకరించాయని తెలిపారు. అదీకాక అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పిటి)పై ఇరాన్ సైతం సంతకం చేసిందని, అయినప్పటికీ ఈ నెల 12న ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడి ప్రారంభించిందని పేర్కొన్నారు. ఇప్పుడు అమెరికా కూడా ఈ దాడులకు ఇజ్రాయిల్‌తో చేతులు కలిపిందని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇరాన్‌పై దాడి చేయడం పశ్చిమ ఆసియాపై పెత్తనం చెలాయించేందుకేనని, ప్రపంచాన్ని భయపెట్టేందుకేనని స్పష్టమవుతోందని వారు తెలిపారు. ఏ విధంగా చూసినప్పటికీ అమెరికా దాడి ప్రపంచ వ్యాప్తంగా ఘర్షణలను తీవ్రతరం చేస్తుందని, ఈ దాడి ప్రపంచ శాంతి పైనా, సాధారణ ప్రజల జీవనోపాధి మీద వినాశకరమైన ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా చమురు దిగుమతుల కోసం, వలస కార్మికులకు అవకాశాల కోసం పశ్చిమాసియాపై ఎక్కువగా ఆధారపడుతున్న భారత్ వంటి దేశాలపై ఈ ప్రభావం మరింత అధికంగా ఉంటుందని వివరించారు. భారత ప్రభుత్వం వెంటనే అమెరికా, ఇజ్రాయిల్ అనుకూల విదేశాంగ విధాన వైఖరిని విడనాడి యుద్ధాన్ని ఆపడానికి అంతర్జాతీయంగా జరుగుతున్న ప్రయత్నాల్లో భాగస్వామిగా చేరాలని వారు కోరారు.

మాది మెతక ప్రభుత్వం కాదు!

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం
- 'సుపరిపాలన' కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'మాది మంచి ప్రభుత్వమే... కానీ, మెతక ప్రభుత్వం కాదు' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. కూటమి ప్రభుత్వానికి ఏడాది పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'సుపరిపాలన–తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పిచ్చి పిచ్చి వేషాలు వేసి, ప్రజల్లో భయాందోళనలు సృష్టించి, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎన్‌డిఎ కూటమి ఐక్యతను చెడగొట్టే పరిస్థితుల్లో ఎవరూ లేరని అన్నారు. మరో 20 ఏళ్లు కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని, వైసిపి ప్రభుత్వం రాదని చెప్పారు. గొంతులు కోస్తాం... తలలు నరికేస్తాం వంటి బెదిరింపులకు, తాటాకు చప్పుళ్లకు భయపడేవారు తమ ప్రభుత్వంలో ఎవరూ లేరని చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అందిస్తున్న సహాయ సహకారాలతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనా దక్షతతో స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047, వికసిత్ భారత్ లక్ష్యాల సాధన దిశగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు. రాష్ట్ర విస్తీర్ణంలో ప్రస్తుతం 30 శాతంగా ఉన్న అటవీ విస్తీర్ణాన్ని 2029 నాటికి 37 శాతానికి పెంచే విధంగా ప్రణాళికలు రూపకల్పన చేస్తున్నామన్నారు. ఎకో టూరిజం అభివద్ధికి చర్యలు చేపట్టామన్నారు. రూ. 1,122 కోట్లతో 61 నగర వనాలను అభివద్ధి చేస్తున్నామని తెలిపారు.

నిరంతరం పనిచేయాలి: లోకేష్

'ఎమ్మెల్యేలు, ఎంపీలు కాలర్ ఎగరేసి తిరగడం కాదు, ఒళ్లు దగ్గర పెట్టుకొని ప్రజల కోసం నిరంతరం పనిచేయాలి' అని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగస్తుల సహకారం ఎంతో అవసరమని చెప్పారు. ప్రభుత్వ అధికారులు ప్రజలకు మరింత దగ్గరవ్వాలని కోరారు. అనేక సమస్యలతో వచ్చే ప్రజలను ఆప్యాయంగా పలకరించి సమసల పరిష్కారం కోసం కషి చేయాలని కోరారు. ఉద్యోగస్తులు తలుచుకుంటే స్వర్ణాంధ్ర కచ్చితంగా సాధ్యమని తెలిపారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు ప్రశాంతత వచ్చిందన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజల మొఖంలో చిరునవ్వు వచ్చిందని, ప్రజా సంఘాలకు ప్రశ్నించే హక్కు వచ్చిందని వెల్లడించారు. గత ప్రభుత్వానికి వెయ్యి రూపాయల పెన్షన్ పెంచడానికి ఐదేళ్లు పట్టిందని, చంద్రబాబు ప్రభుత్వం కేవలం ఒకే ఒక్క సంతకంతో పెన్షన్ వెయ్యి రూపాయలు పెంచారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎంపి దగ్గుపాటి పురంధేశ్వరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రెయిట్ కట్ కాల్వ ఆక్రమణదారులపై చర్యలు

- ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్యకార్మికుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బాపట్ల జిల్లా ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ కాల్వను ఇసుకతో పూడ్చివేసి నీటి ప్రవాహం నేరుగా సముద్రంలోకి వెళ్లేటట్లు సీమౌత్ స్వరూపాన్ని మార్చేసిన ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్యకార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆయన స్థానిక మత్స్యకారులతో సోమవారం సమావేశమై ఈ సమస్యపై చర్చించారు. బాపట్ల, చీరాల ఎమ్మెల్యేల అండదండలతో బూర్ల వెంకట్రావు సిఆర్‌జెడ్ పరిధిలో కాల్వ సమీపంలో రిసార్ట్ నిర్మించి, అక్కడకి వచ్చే పర్యాటకుల కోసం స్ట్రెయిట్ కట్ కాల్వను పూడ్చివేసినట్లు తెలిపారు. సీమౌత్ వెయ్యి మీటర్ల కాలువ, ఇరిగేషన్ భూమిని ఆక్రమించి మత్స్యకారుల బోట్లు వెళ్లకుండా అడ్డుకట్టు వేసి దుర్మార్గమైన చర్యలకు పాల్పడిన వెంకట్రావుపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారం రోజులుగా మత్స్యకారులు ఆందోళన చేస్తున్నా పోలీసు, రెవెన్యూ అధికారులు స్పందించకపోవడాన్ని తప్పుబట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఒక పథకం ప్రకారం రెవెన్యూ రికార్డుల్లో వెంకట్రావు, తన కుటుంబ సభ్యుల పేర్లను, భూముల వివరాలను ఆన్‌లైన్ చేయించుకున్నారని తెలిపారు. సిఆర్‌జడ్ నిబంధనల మేరకు నో డెవలప్‌మెంట్ జోన్‌లో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకూడదన్న నిబంధనలకు విరుద్ధంగా, ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం, స్ట్రెయిట్ కట్ కాల్వ స్వరూపాన్ని మార్చడం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారన్నారు. ప్రజా సంఘాల నాయకులు నలతోటి బాబూరావు మాట్లాడుతూ.. మత్స్యకారులపై కేసులు పెట్టడం తగదన్నారు. స్ట్రెయిట్ కట్ కాలువను యథాతథంగా రూపొందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ఈ నెల 24న బాపట్ల జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ మొగ పునరుద్ధరణ సాధన సమితి కన్వీనర్ ఏరిపల్లి రమణ తెలిపారు.

కన్నబిడ్డలను చంపిన కసాయి తండ్రి అరెస్టు

ప్రజాశక్తి - మైలవరం

భార్యపై అనుమానంతో ఇద్దరు పిల్లలను చంపి, ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు నాటకమాడి పరారైన కసాయి తండ్రిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈ నెల 12న వెలుగుచూసిన ఈ ఘటనపై సిఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్‌టిఆర్ జిల్లా మైలవరానికి చెందిన వేములమడ రవిశంకర్ పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన చంద్రికను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి లక్ష్మీ హిరణ్య (9), లీలా సాయి (7) ఉన్నారు. రవి శంకర్ స్థానికంగా ఉన్న ఓ హోటల్‌లో పని చేస్తుండేవాడు. కుటుంబ పోషణ, ఆర్థిక ఇబ్బందుల వల్ల చంద్రిక బహ్రెయిన్‌కు వెళ్లారు. తన భార్యకు వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో ఈ నెల 8న పిల్లలిద్దరినీ ఇంట్లోనే చంపేసి, సూసైడ్ నోట్ రాసి వెళ్లిపోయాడు. విశాఖపట్నం వెళ్లి ఓ హోటల్లో పనిచేస్తూ రైల్వేస్టేషన్లో తలదాచుకుంటున్నాడు. ఎసిపి వై ప్రసాద్‌రావు నేతృత్వంలో నాలుగు బృందాలు గాలించి, నిందితుడిని విశాఖలో అరెస్టు చేసి, విజయవాడ తీసుకొచ్చారు.

గ్రామ, వార్డు సిబ్బంది కుదింపుపై వివరణ ఇవ్వండి

- రాష్ట్రానికి హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది కుదింపు, గ్రామ సచివాలయాలను ఎ, బి, సి కేటగిరీలుగా వర్గీకరణ చేస్తూ వెలువడిన జిఓపై వివరణ ఇవ్వాలని రాష్ట్రానికి హైకోర్టు నోటీసులిచ్చింది. ఈ మేరకు గత జనవరి 25న జారీ చేసిన జిఓ 1, ఏప్రిల్ 10న జారీ చేసిన జిఓ 4ను సవాల్ చేస్తూ గ్రామ ఉద్యానవన సహాయకుల సంక్షేమ సంఘం హైకోర్టును ఆశ్రయించింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన వ్యవసాయ, ఉద్యానవనశాఖ ముఖ్యకార్యదర్శి, గ్రామ, వార్డు సచివాలయాలశాఖ కార్యదర్శి, ఉద్యానవనశాఖ కమిషనర్‌ను ఆదేశించింది. నాలుగు వారాల్లోగా పిటిషనర్ వినతిని పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వానికి జస్టిస్ చల్లా గుణరంజన్ ఆదేశాలు జారీ చేశారు. రెండు జిఓలను రద్దు చేయాలని కోరుతూ సంఘం అధ్యక్షులు జి సురేంద్ర వేసిన పిటిషన్‌పై నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.

సిజె ముందుకు మిథున్‌రెడ్డి కేసు

మద్యం కుంభకోణం వ్యవహారంలో వైసిపి ఎంపి మిథున్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ ముందుంచాలని రిజిస్ట్రీని జస్టిస్ వై లక్ష్మణరావు ఆదేశించారు. ఇదే తరహా పిటిషన్‌పై మరో జడ్జి విచారణ చేపట్టారని, ప్రాసిక్యూషన్ వాదనలు కూడా ప్రారంభమయ్యాయని, కాబట్టి ఈ పిటిషన్‌ను ఎవరు విచారణ చేయాలో నిర్ణయం తీసుకొనేందుకు వీలుగా కేసు ఫైలును సిజె ఎదుట ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

ముగిసిన కృష్ణంరాజు కస్టడీ

- గుంటూరు సబ్ జైలుకు తరలింపు

ప్రజాశక్తి-మంగళగిరి (గుంటూరు జిల్లా)

అమరావతి రైతులను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు వి.వి.ఆర్.కృష్ణంరాజుకు మూడు రోజుల పోలీసు కస్టడీ ముగిసింది. దీంతో ఆయనను తుళ్లూరు పోలీసులు సోమవారం మంగళగిరి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు ఆయనకు తిరిగి రిమాండ్ కొనసాగించింది. గుంటూరు సబ్ జైలుకు తరలించాల్సిందిగా న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. కోర్టు వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు ముందు జాగ్రత్తగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

అటు ఏడాది సంబరాలు... ఇటు జనం గగ్గోలు

- విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాడాలి
- సిపిఎం రాష్ట్ర కార్య దర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు



విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ పాదయాత్రలో సమస్యలు తెలుసుకుంటున్న సిహెచ్.బాబూరావు తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ

ఓవైపు టిడిపి కూటమి సంవత్సర పాలన సంబరాలను ప్రభుత్వం ఘనంగా జరుపుకుంటోందని, మరోవైపు విద్యుత్ ఛార్జీల బాదుడు, స్మార్ట్ మీటర్ల భారాలతో జనం గగ్గోలు పెడుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. ఏడాది పాలనలోనే రూ.15,485 కోట్ల విద్యుత్ సర్దుబాటు ఛార్జీల భారాలను ప్రభుత్వం మోపిందని తెలిపారు. స్మార్ట్ మీటర్లతో అడ్డగోలుగా విద్యుత్ బిల్లులు భారీగా పెరిగాయన్నారు. విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ జూలై 4న విజయవాడలో సిపిఎం పోరుబాటలో భాగంగా జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ పార్టీ నాయకులు సోమవారం పాదయాత్ర నిర్వహించారు. 62వ డివిజన్ పాయికాపురంలోని ప్రకాష్‌నగర్, 59వ డివిజన్ అజిత్‌సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో బాబూరావు, సిపిఎం నేతలు పర్యటించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు, స్మార్ట్ మీటర్లపై స్థానికంగా సభలు నిర్వహించారు.

పలుచోట్ల నిరసన తెలిపారు. కూటమి పాలనలో విద్యుత్ బిల్లులు తగ్గకపోగా, అదనంగా నాలుగు రకాల సర్దుబాటు ఛార్జీల భారాలు మోపారని స్థానికులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ప్రకాష్‌నగర్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో పేదల ఇంటికి మీటర్ రిపేరు పేరుతో పాత మీటర్ తొలగించి స్మార్ట్ మీటర్ బిగించారని స్థానికులు తెలిపారు.

ప్రజల కళ్లుగప్పి మోసపూరితంగా ప్రీపెయిడ్ స్మార్ట్ మీటరు బిగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. అజిత్‌సింగ్ నగర్ లూనా సెంటర్లోని నాగరాజు తన పిండి మరకు ప్రతినెలా రూ.6 వేల బిల్లు వచ్చేదని, స్మార్ట్ మీటర్ బిగించిన తర్వాత బిల్లు రూ.26 వేలకు పెరిగిందని వాపోయారు. విద్యుత్ అధికారులకు విన్నవించుకున్నా ఫలితంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓవైపు సర్దుబాటు ఛార్జీల భారం, మరోవైపు అదాని స్మార్ట్ మీటర్లతో అడ్డగోలుగా పెరిగిన బిల్లులతో ప్రజలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారని అన్నారు.

తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలు అందరికీ అందటం లేదని పలువురు ఫిర్యాదులు చేశారన్నారు. అనేక సమస్యలను నేతల దష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాడాలి కోరారు. పాదయాత్రలో సిపిఎం నేతలు బి.రమణరావు, కే.దుర్గారావు, సిహెచ్. శ్రీనివాస్, పీర్ సాహెబ్ పాల్గొన్నారు.

విద్య వల్లే జీవితాల్లో మార్పులు

- ఇంకొల్లులో సైనిక్ స్కూల్‌ను ప్రారంభించిన మంత్రి లోకేష్



సభలో మాట్లాడుతున్న లోకేష్, వేదికపై దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి, మంత్రులు

ప్రజాశక్తి-ఇంకొల్లు (బాపట్ల జిల్లా)

పేదరికం నుంచి బయటకు రావాలంటే అద్భుతమైన విద్యను అందించాల్సిన అవసరం ఉందని, విద్య వల్లే మన జీవితాల్లో అద్భుతమైన మార్పులు వస్తాయని మంత్రి లోకేష్ అన్నారు. బాపట్ల జిల్లా, ఇంకొల్లు - గంగవరం రోడ్డులో మాజీ మంత్రి డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నూతనంగా నెలకొల్పిన డాక్టర్ డివిఆర్ సైనిక్ స్కూల్‌ను మంత్రి లోకేష్ లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన దగ్గుబాటి చెంచురామయ్య, నీలమోహన్ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లోకేష్ మాట్లాడుతూ.. 'ఛాలెంజ్‌లు అంటే నాకు చాలా ఇష్టం. ఛాలెంజ్‌లను స్వీకరిస్తాను. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ విద్య ఎలా ఉంటుందో చూపిస్తాను. విద్యాశాఖలో సంస్కరణలు తీసుకొచ్చాం. దేశం మొత్తం రాష్ట్రం వైపు చూసేలా విద్యావ్యవస్థను తీర్చిదిద్దే బాధ్యతను మన ప్రభుత్వం తీసుకుంటుంది' అని అన్నారు. బాగా చదువుకున్న వారు రాజకీయాల్లోకి రావాలని కోరారు. మన కోసం పోరాడుతూ జవాన్ మురళినాయక్ చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సైనికుల త్యాగాల వల్లే నేడు మనం సురక్షితంగా ఉండగలుగుతున్నామన్నారు.

కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి, డాక్టర్ డివిఆర్ సైనిక్ స్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ హితేష్ చెంచురామ్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, స్వామి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అవినాష్‌రెడ్డి అనుచరులపై కేసు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

కడప ఎంపి అవినాష్‌రెడ్డి అనుచరులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ విష్ణు నారాయణ తెలిపారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడైన సునీల్ కుమార్ యాదవ్‌ను కారులో వెంబడించిన నేపథ్యంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి పిఎ లోకేష్‌రెడ్డి, సోషల్ మీడియా కార్యకర్త పవన్ కుమార్, మరొకరిపై బిఎన్ఎస్ చట్టం 351, 126 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ఈ సందర్భంగా వైఎస్ వివేకా కేసు సిట్ అధికారి ఉలసయ్య సోమవారం మీడియాతో మాట్లాడారు. ఈ నెల 21వ తేదీన సునీల్ కుమార్ యాదవ్ పెళ్లిరోజు సందర్భంగా సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి పట్టణంలోని శ్రీకృష్ణ దేవాలయం దర్శనానికి వెళ్లి వస్తుండగా పవన్, లోకేష్‌లు వెంబడించి ఆయన వాహనాన్ని అడ్డుకున్నారని పేర్కొన్నారు. హత్య సినిమాలో సునీల్‌ను, ఆయన తల్లిని అసభ్యకరంగా చిత్రీకరించారంటూ గతంలో ఆయన ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు తనను బెదిరిస్తున్నారని సునీల్ మరోసారి ఫిర్యాదు చేశారు.



సదస్సులో మాట్లాడుతున్న అజశర్మ, వేదికపై నాయకులు

అమెరికా ప్రోత్సాహంతోనే యుద్ధాలు

- పాలస్తీనాకు అండగా నిలుద్దాం
- ఎస్ఎఫ్ఐ సదస్సులో అజశర్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నేడు ప్రపంచ దేశాల్లో జరుగుతున్న యుద్ధాలన్నీ అమెరికా ప్రోత్సాహంతో జరుగుతున్నవేనని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అన్నారు. 'ప్రపంచ యుద్ధాలు- పర్యవసానాలు- పాలస్తీనాకు సంఘీభావం' అనే అంశంపై స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో సోమవారం సదస్సు జరిగింది. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము అధ్యక్షతన జరిగిన సదస్సులో ముందుగా యుద్ధాల్లో మరణించిన వారికి నివాళులర్పించారు. అనంతరం అజశర్మ మాట్లాడుతూ.. ఇజ్రాయెల్-ఇరాన్ దేశాల మధ్య యుద్ధం జరుగుతుందని, ఇజ్రాయిల్‌కు అమెరికా మద్దతు ఇచ్చి నేరుగా యుద్ధంలో పాల్గొంటుందన్నారు. అణుబాంబులు తయారు చేయడానికి వీలు లేదంటూ ఇరాన్‌పై యుద్ధం చేస్తున్నాయని చెప్పారు. ఇరాన్‌పై అమెరికా అణుబాంబులు వేసి ప్రపంచాన్ని బయపెట్టే ప్రయత్నం చేసిందన్నారు. జపాన్‌లో అణుబాంబు దాడి పరిణామాలు నేటికి కనబడుతున్నాయని తెలిపారు. అమెరికా అణ్వాయుధాలు పాకిస్తాన్‌లో ఉండటమే భారత్-పాక్ మధ్య యుద్ధం ఆగిపోవడానికి కారణమన్నారు. గాజా మీద దాడి చేసి పసిపిల్లలను చంపేస్తున్న ఇజ్రాయిల్‌కు అమెరికా మద్దతునివ్వడం దారుణమన్నారు. యుద్ధ సామగ్రి మీద అమెరికా ఆర్థిక వ్యవస్థ ఆధారపడి ఉందని తెలిపారు. మన దేశంలో ప్రజలు, కార్మికులు, నిరుద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ విధానాలకు వ్యతిరేకంగా అంతర్యుద్ధం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రపంచంలో పెట్టుబడిదారీ విధానం నాశనం అయితే తప్ప యుద్ధాల నియంత్రణ జరగదన్నారు. మాతృభూమి కోసం పాలస్తీనా దేశస్తులు చేస్తున్న పోరాటానికి అండగా నిలబడాలని కోరారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ మాట్లాడుతూ.. పాలస్తీనాకు విద్యార్థులు, యువత సంఘీభావంగా నిలబడాలని కోరారు. సదస్సులో ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు పావని, జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేష్, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం శ్రీనివాస, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఉన్నతాదికార్ల పర్యటన

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ జాయింట్ అడ్వైజరు (ఎన్‌డిఎంఎ) నావల్ ప్రకాష్, సెక్రటరీ అభిషేక్ బిస్వాస్, సీనియర్ కన్సల్టెంట్ అభినవ్‌వాలియా బృందం సోమవారం విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విపత్తుల నిర్వహణ సంస్థ అమలు చేసే ప్రణాళికలు, నైరుతీ రుతుపవనాల సీజన్ సంసిద్ధత, ముందస్తు హెచ్చరికల వ్యవస్థ పనితీరు, కమ్యూనికేషన్ పరికరాల గురించి బృందానికి ఇడి వెంకట దీపక్ వివరించారు. ఈ బృందం సోమవారం ఎన్‌టిఆర్ జిల్లాలో పర్యటించగా, మంగళవారం విజయనగరం, బుధవారం విశాఖ జిల్లాల్లో పర్యటించనుంది. ఈ పర్యటనల్లో జిల్లాల కలెక్టర్లు, లైన్ డిపార్టుమెంట్ల అధికారులతో సమావేశమవ్వనుంది. విపత్తు నిర్వహణ, ఎస్ఒపి, జిల్లా ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ పనితీరు, విపత్తు ప్రమాద తగ్గింపునకు విధి విధానాలు బలోపేతం చేయడానికి, భవిష్యత్తు విపత్తుల సన్నద్ధతపై జిల్లా యంత్రాంగం చేపట్టే చర్యల మీద ఈ బృందం సమీక్షించనుంది.

ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహం

- 20 సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ దినకర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనే లక్ష్యంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, ఎంఎస్ఎంఇ ప్రోత్సాహానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని 20 సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. సచివాలయంలో ఎంఎస్ఎంఇ ఛైర్మన్ శివశంకర్, సీడాప్ ఛైర్మన్ దీపక్ రెడ్డితో కలిసి సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుతం 8 లక్షలకుపైగా ఎంఎస్ఎంఇలు ఉన్నాయని, దేశ జిడిపిలో 30 శాతం, ఎగుమతుల్లో 40 శాతం వాటా ఎంఎస్ఎంఇలు కలిగి ఉన్నట్లు చెప్పారు. ఎంఎస్ఎంఇ ఛైర్మన్ శివశంకర్ మాట్లాడుతూ.. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం వంటి వెనుకబడిన జిల్లాలో పరిశ్రమలు, ఎంఎస్ఎంఇ యూనిట్లు ఏర్పాటుతో అక్కడి నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తోందన్నారు. సీడాప్ ఛైర్మన్ దీపక్‌రెడ్డి మాట్లాడుతూ.. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు, శిక్షణ పొందిన వారికి బైబ్యాక్ ఫైనాన్సింగ్ సౌకర్యాన్ని కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

యాప్‌లను ప్రభుత్వాలే నిర్వహించాలి

- కార్మికుల సమస్యలపై జెసికి సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ వినతి



జెసి ఇలక్కియాకు వినతిపత్రం అందించి ఆటో కార్మికుల సమస్యలపై మాట్లాడుతున్న యూనియన్ నాయకులు దుర్గారావు తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ


ఓలా, ఊబర్, ర్యాపిడో వంటి బడా కంపెనీల యాప్‌ల స్థానంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా యాప్‌లను ప్రవేశపెట్టి ఆటో మోటార్ కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియాకు వందలాది సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నేతలు అందజేశారు. ఓలా, ఊబర్, ర్యాపిడ్ రేట్లు పెంచాలని, యాజమాన్యాలతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు. ఆటో స్పేర్ పార్ట్స్ ధరలు, నిత్యావసర వస్తువులు, సిఎన్‌జి గ్యాస్ ధరలు విపరీతంగా పెరగడంతో ఆటో కార్మికులకు కిరాయిలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఓలా, ఊబర్, ర్యాపిడ్ వంటి విదేశీ యాప్‌ల కారణంగా ఆటో కిరాయిలు తక్కువగా ఉండడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సంబంధిత యాప్‌ల యాజమాన్యాలతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి ధరలు పెంచే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై జెసి స్పందిస్తూ రవాణా శాఖాధికారులను పిలిచి సమస్య పరిష్కారానికి ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులతో మాట్లాడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర నాయకులు పాల్గొన్నారు.

గల్ఫ్‌కు భారత ఎగుమతులు తగ్గొచ్చు..! : ఎఫ్ఐఇఒ

న్యూఢిల్లీ : ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ప్రస్తుతం కొనసాగుతున్న యుద్ధం భారత ఎగుమతుల పైనా ప్రభావం చూపనుందని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఐఇఒ) పేర్కొంది. ముఖ్యంగా గల్ఫ్ ప్రాంతంలో ఉత్పత్తులకు డిమాండ్ తగ్గనుందని.. దీంతో సరకు రవాణ పడిపోనుందని తెలిపింది. మరోవైపు రవాణ ఖర్చులు పెరగడంతో పాటు సముద్ర బీమా ప్రీమియంలు భారం కానున్నాయని ఎఫ్ఐఇఒ అధ్యక్షుడు ఎస్‌సి రాల్హాన్ పేర్కొన్నారు. ముడి చమురు ధరల్లో అస్థిరత ద్రవ్యోల్బణం, లాజిస్టిక్స్ ఖర్చులను ప్రభావితం చేస్తుందన్నారు. అయితే ఇది భారతీయ ఎగుమతిదారులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించడానికి, ప్రాంతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేసుకోవడానికి ఓ అవకాశమని అన్నారు.

మార్కెట్లను వీడని యుద్ధ భయాలు

- ఆల్ టైం కనిష్టానికి ఓలా ఎలక్ట్రిక్ షేర్లు



న్యూఢిల్లీ : భారత మార్కెట్లలో ఇజ్రాయిల్ - ఇరాన్ యుద్ధ భయాలు కొనసాగుతున్నాయి. ఈ ఉద్రిక్తతల్లో అమెరికా జోక్యం చేసుకోవడంతో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. మరోవైపు చమురు ధరలు ఎగిసిపడుతోన్నాయి. ఈ పరిణామాలతో సోమవారం సెషన్‌లో బిఎస్ఇ సెన్సెక్స్ చివరికి 511 పాయింట్లు లేదా 0.62 శాతం పతనమై 81,896.79కి పరిమితమయ్యింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 140.50 పాయింట్లు లేదా 0.56 శాతం కోల్పోయి 24,971 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, ఎల్అండ్‌టి, మహీంద్రా అండ్ మహీంద్రా, హిందుస్థాన్ యూనిలీవర్ అధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. ప్రముఖ విద్యుత్తు ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ షేర్లు ఆల్‌టైమ్ కనిష్టాన్ని తాకాయి. బ్లాక్‌డీల్ కారణంగా సోమవారం పెద్ద మొత్తంలో కంపెనీ షేర్లు చేతులు మారిన నేపథ్యంలో వాటి విలువ పతనమైంది. కంపెనీలో 0.8 శాతం వాటాకు సమానమైన 44 లక్షల షేర్లు రూ.44.1 వద్ద చేతులు మారాయి. దీంతో బిఎస్ఇలో షేర్ విలువ 6 శాతం మేర పతనమై రూ.43.20 వద్ద కనిష్టాన్ని తాకింది. గత 12 నెలల్లో షేరు విలువ 51 శాతం మేర పతనమయ్యింది.

జగన్ కాన్వాయ్ ప్రమాద కేసులో రక్షణ కల్పించండి

- పేర్ని నాని, విడదల రజిని పిటిషన్లు

ప్రజాశక్తి-అమరావతి: గుంటూరు జిల్లా, రెంటపాళ్ల గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగయ్య అనే వ్యక్తి మరణించిన ఘటనపై నల్లపాడు పోలీసులు పెట్టిన కేసును కొట్టేయాలంటూ మాజీ మంత్రులు పేర్ని నాని, విడదల రజిని హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌లపై జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు మంగళవారం విచారణ చేపట్టనున్నారు.

విద్యార్థుల భవిష్యత్‌పై ప్రభావం పడకూడదు

డిగ్రీ కాలేజీ యాజమాన్యాలు చేసిన తప్పులకు విద్యార్థులతో ఎలా ఆడుకుంటారని నాగార్జున యునివర్సిటీ రిజిస్ట్రార్‌ను హైకోర్టు ప్రశ్నించింది. అఫిలియేషన్, ఇతర ఫీజులు చెల్లించని కాలేజీ యాజమాన్యాలపై వర్సిటీ చర్యలు తీసుకోవచ్చునని, అయితే, 2022-25 బ్యాచ్ 6వ సెమిస్టర్ పరీక్షలు రాసిన విద్యార్థుల ఫలితాలను వెల్లడించకపోవడం సరికాదని స్పష్టం చేసింది. పరీక్షల ఫలితాలు వెల్లడించకపోతే విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేసింది. కాలేజీ యాజమన్యాల నుండి సొమ్మును రాబట్టే ప్రయత్నాలు పరిశీలించాలంది. రిజిస్ట్రార్ మాట్లాడి సమస్యకు తగిన పరిష్కారం కనుగొనాలని అడ్వకేట్ జనరల్‌కు సూచించింది. ఆరో సెమిస్టర్ రాసిన విద్యార్థుల పరీక్షా ఫలితాలను ఆచార్య నాగార్జున యునివర్సిటీ ప్రకటించకపోవడాన్ని తప్పుపడుతూ గుంటూరు జిల్లాకు చెందిన మహాత్మా గాంధీ కాలేజ్, ప్రకాశం జిల్లాకు చెందిన కారి-కేయ డిగ్రీ కాలేజీ, అదే జిల్లాకు చెందిన ఇతర ప్రైవేటు డిగ్రీ కాలేజీ యాజమాన్యాలు వేసిన వ్యాజ్యాలపై విచారణను ఈ నెల 26కు వాయిదా వేస్తూ జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ సోమవారం ఆదేశాలిచ్చారు. గత ఆదేశాల మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ స్వయంగా కోర్టుకు హాజరయ్యారు.

కృష్ణంరాజుపై ఒకే కేసు

సాక్షి టివిలో జరిగిన చర్చ సమయంలో రాజధాని అమరావతి ప్రాంత మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్ట్ వివిఆర్ కృష్ణంరాజుపై తుళ్లూరు పోలీసులు నమోదు చేసిన కేసును ప్రధాన కేసుగా పరిగణించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. వేర్వేరు పిఎస్‌లలో నమోదైన కేసులను సిఆర్‌పిసి సెక్షన్ 162 కింద స్టేట్మెంట్లుగా పరిగణించాలంది. పార్వతీపురం మన్యం జిల్లా, సాలూరు, ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ పటమట ఇతర పోలీస్ స్టేషన్‌ల్లో వేర్వేరు కేసులపై చర్యలను నిలుపుదల చేసింది. వ్యాజ్యాలను పరిష్కరించినట్లు జస్టిస్ ఎన్ హరినాథ్ ప్రకటించారు. రాష్ట్రంలోని వేర్వేరు పిఎస్‌లలో కేసులు నమోదు చేయడాన్ని రాజు సవాల్ చేసిన పిటిషన్‌పై హైకోర్టు తుది ఉత్తర్వులు జారీ చేసింది.

పత్రికల కథనాల ఆధారంగా పిటిషన్ చెల్లదు

పత్రికల్లో కథనాల ఆధారంగా పిటిషన్ వేయడానికి వీల్లేదని మాజీమంత్రి పేర్ని నాని, కుమారుడు సాయి కృష్ణమూర్తికి హైకోర్టు స్పష్టం చేసింది. గత అసెంబ్లీ ఎన్నికలప్పుడు నకిలీ పట్టాలు పంపిణీ చేశారంటూ వచ్చిన కథనం ఆధారంగా తమపై పోలీసులు తప్పుడు కేసు నమోదు చేసే అవకాశం ఉందని, రక్షణ కల్పించేలా ఉత్తర్వులు ఇవ్వాలని దాఖలుచేసిన పిటిషన్లపై జస్టిస్ వై లక్ష్మణ రావు ఉత్తర్వులిచ్చారు. ఇళ్ల పట్టాల పంపిణీకి తహశీల్దారే బాధ్యులని, పిటిషనర్లను కేసులో ఇరికించేందుకు, ఎఫ్ఐఆర్ నమోదుకు ప్రయత్నిస్తున్నారని పేర్ని నాని, సాయి తరపున న్యాయవాది వాదనలు వినిపించారు. వాదనల తర్వాత పిటిషన్లను పరిష్కరించినట్లుగా హైకోర్టు ప్రకటించింది.

డమాస్కస్ చర్చిలో ఆత్మాహుతి దాడి : 20 మంది మృతి

డమాస్కస్ : డమాస్కస్‌లోని మార్ ఎలియాస్ క్రిస్టియన్ చర్చిలో ఆదివారం ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ దాడిలో 20 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. 52 మంది గాయాల పాలయ్యారని సిరియా ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఉగ్రవాద సంస్థ ఐఎస్ఐఎస్‌కు చెందిన ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడు. దీంతో చర్చికి ప్రార్థనల కోసం వచ్చిన వారిలో 20 మంది మరణించగా, డజన్ల సంఖ్యలో క్షతగాత్రులయ్యారు. ఈ ఘటనను సిరియా విదేశాంగ మంత్రిత్వశాఖ తీవ్రంగా ఖండించింది. మృతులకు సిరియా అంతర్గత మంత్రి అనాస్ ఖత్తాబ్ సంతాపం వ్యక్తం చేశారు. ప్రత్యేక బృందాలు ఈ ఘటనపై విచారణ చేపట్టినట్లు ఆయన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

బుగ్గ మఠం భూముల ఆక్రమణ కేసుపై హైకోర్టుకు వెళ్లండి

- పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సుప్రీం సూచన
- 2 వారాల పాటు స్టేటస్ కో

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బుగ్గ మఠం భూముల ఆక్రమణ కేసుపై హైకోర్టును ఆశ్రయించాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సుప్రీంకోర్టు సూచించింది. బుగ్గ మఠం భూములు సర్వే నిర్వహించి, పెద్దిరెడ్డి ఆక్రమణలో ఉన్న భూములను రెవెన్యూ యంత్రాంగం స్వాధీనం చేసుకుంది. తిరుపతిలో రెండు సర్వే నెంబర్లలో 2.38 ఎకరాల ఆక్రమించిన బుగ్గ మఠం భూములు ఖాళీ చేయాలని మే 16న ఇఒ నోటీసులు జారీ చేశారు. దీనిపై పెద్దిరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఆక్రమించిన భూములకు సంబంధించిన విషయంలో పెద్దిరెడ్డి వద్ద ఎలాంటి ఆధారాలు లేవని హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఇఒ జారీ చేసిన ఉత్తర్వులపై నేరుగా హైకోర్టుకు రాకూడదని, ఏదైనా ఉంటే దేవాదాయ ట్రిబ్యునల్‌కు వెళ్లాలని వాదించింది. రాష్ట్ర ప్రభుత్వ వాదనతో ఏకీభవించి హైకోర్టు సింగిల్ జడ్జి, దేవాదాయ ట్రిబ్యునల్‌కు వెళ్లాలని పెద్దిరెడ్డిని ఆదేశించింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై పెద్దిరెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ కెవి విశ్వనాథన్, జస్టిస్ ఎన్‌కె సింగ్‌తో కూడిన ధర్మాసనం విచారించింది.

దీనికి సంబంధించి హైకోర్టునే ఆశ్రయించాలని పెద్దిరెడ్డికి న్యాయస్థానం సూచించింది. ఎపి హైకోర్టు డివిజన్ బెంచ్ విచారణ చేయాలని స్పష్టం చేసింది. బుగ్గ మఠం భూములపై రెండు వారాల పాటు యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని పేర్కొంది. అనంతరం పెద్దిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలను ముగించింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది మణిందర్ సింగ్, రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు.

అరజన్ ఫార్మాలో ప్రమాదం

ఇద్దరు కార్మికులకు గాయాలు

ప్రజాశక్తి - పరవాడ (అనకాపల్లి)

పరవాడ జెఎన్ ఫార్మా సిటీ, రాంకీ ఎస్ఇజెడ్‌లోని అరజన్ ఫార్మా పరిశ్రమలో సోమవారం తెల్లవారుజామున ప్రమాదం చోటుచేసుకుంది. రియాక్టర్ వద్ద మెయింటినెన్స్ చేసే క్రమంలో ఉప్పు లాంటి ద్రావణం పడటంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు జగదీష్, తులసీరావు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.

సమగ్ర దర్యాప్తు చేయాలి : సిఐటియు

సమగ్ర విచారణ చేసి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే వారు ఘటనా స్థలానికి వెళ్లేందుకు ప్రయత్నించగా రాంకీ యాజమాన్యానికి చెందిన సెక్యూరిటీ గార్డులు గేటు వద్ద అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు నేతలు మాట్లాడుతూ.. గాయపడ్డ కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ప్రమాద విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

కిడ్నీ వ్యాధితో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఎ.కొండూరు : ఎన్‌టిఆర్ జిల్లా ఎ.కొండూరు మండలంలో కిడ్నీ వ్యాధి మరణాలు కొనసాగు తున్నాయి. తాజాగా చీమలపాడు గ్రామానికి చెందిన గద్దల లాలయ్య (67) మరణించారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... లాలయ్య గత కొద్దికాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. వ్యవసాయ కార్మికుడిగా జీవనం సాగిస్తున్న లాలయ్యకు కిడ్నీవ్యాధి సోకడంతో ఇప్పటి వరకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.ఐదు లక్షల వరకు ఖర్చు పెట్టారు. అయినా ఫలితం లేకపోవడంతో మరణించారు. లాలయ్య కుటుంబాన్ని సిపిఎం మండల కార్యదర్శి పి.ఆనందరావు, సీనియర్ నాయకులు ఎ.అమ్మిరెడ్డి పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ... సంవత్సర కాలంలోనే ఎ. కొండూరులో పదిమందికిపైగా కిడ్నీవ్యాధితో మరణించారని తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని కోరారు.

సంపాదకీయం


'ఫైనాన్స్' ఆగడాలు

రాష్ట్రంలో అప్పుల వాళ్ల ఆగడాలకు హద్దు పద్దు లేదని ప్రకాశం జిల్లా శింగరాయకొండ మండలం బింగినపల్లి గ్రామ గిరిజన వృద్ధ దంపతులు ఇరవై రోజులుగా పడుతున్న అగచాట్లతో లోకానికి వెల్లడైంది. కుమారుడు ఇంటిని తనఖా పెట్టి రూ. రెండున్నర లక్షలు అప్పు చేసి, ఠంచనుగా కిస్తులు చెల్లించి, తీవ్ర ఇబ్బందుల చేత రెండు వాయిదాలు చెల్లించకపోయేసరికి 'ఫైవ్‌స్టార్' సంస్థ మనుషులు రెచ్చిపోయారు. అత్యంత కర్కశంగా ఇంటిలో ఉంటున్న తల్లిదండ్రులను బయటికి గెంటివేసి తాళం వేశారు. అప్పటి నుంచీ వృద్ధ దంపతులు బయటనే కాలంవెళ్లదీస్తున్న దైన్యం. సరిగ్గా వారం కిందటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం నారాయణపురంలో భర్త అప్పు తీర్చలేదని భార్యను పట్టపగలు నడిరోడ్డుపై ఈడ్చుకెళ్లి తాళ్లతో చెట్టుకు కట్టేసి అసభ్య పదజాలంతో చిత్ర హింసలకు గురిచేసిన ఘటన సభ్య సమాజానికి కళంకం. ముఖ్యమంత్రి స్వంత ఇలాకా కాబట్టి సిఎం, హోం మంత్రి, డిజిపి తదితరులు హుటాహుటిన స్పందించాల్సి వచ్చింది. పల్లెల్లో ఆధునిక కాబూలీల చెరలో పడి నలిగి పోతున్న, బలవన్మరణాలకు పాల్పడుతున్న అభాగ్యుల వెతలు రాష్ట్ర వ్యాప్తంగా చాలానే కనిపిస్తాయి. వెలుగు చూసేవి నామమాత్రం కాగా బయటికి రాకుండా మాసిపోతున్నవి అసంఖ్యాకం.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గుతూ, నిరుద్యోగం పెరుగుతున్న వేళ విద్య, వైద్యం ఇత్యాది అత్యవసర ఖర్చుల నిమిత్తం పేద, సామాన్య ప్రజలు ఎంత వడ్డీకైనా అప్పులు చేసే అనివార్యత ఏర్పడుతోంది. జనం అవసరాలు పెరుగుతుండటంలో చిన్న పల్లెల్లో సైతం పెద్ద పెద్ద ఫైనాన్స్ సంస్థలు బయలు దేరాయి. అప్పులు తీసుకోమని అవే ప్రోత్సహిస్తున్నాయి. పంట పండించే రైతుకు, కౌలు రైతులకు అప్పులివ్వడానికి సవాలక్ష కొర్రీలు వేసే బ్యాంకులు సైతం బైక్‌లు, కార్లు, స్వర్ణాభరణాలు, గృహోపకరణాల కొనుగోలుకు ఎలాంటి షరతులూ లేకుండా విరివిగా లోన్లు ఆఫర్ చేస్తున్నాయి. అవసరం లేకపోయినా అప్పు చేయడం ఒక ఎత్తయితే విద్య, వైద్యం వంటి అత్యవసరాల కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ వలన దిక్కులేక అప్పుల బారిన పడటం మరో ఎత్తు. రాత్రికి రాత్రి జాక్‌పాట్ కొట్టి సంపన్నులు కావాలన్న ఉబలాటం మరొక కోణం. నయా-ఉదారవాద యుగం సృష్టించిన వినిమయ సంస్కృతి పర్యవసానమిది.

ఉమ్మడి రాష్ట్రంలో 2010 ప్రాంతంలో మైక్రో ఫైనాన్స్ సంస్థల రౌడీయిజం ప్రజలకు అనుభవమే. ఏజెంట్లు గడప గడపకు తిరిగి మహిళలను ఆకర్షించి అధిక వడ్డీలకు చిన్న మొత్తాల్లో అప్పులిచ్చి, ఆపై తిరిగి చెల్లించలేదంటూ ఇష్టారీతిన అవమానాలకు, వేధింపులకు గురి చేయడంతో పెద్ద ఎత్తున ఆత్మహత్యలు సంభవించాయి. అప్పటి ప్రభుత్వం మైక్రో సంస్థల నియంత్రణకు చట్టం కూడా చేసింది. మైక్రోలు చాలా ఏళ్లు రాష్ట్రం వంక చూడలేదు. రెండు మూడేళ్ల నుంచి మళ్లీ బిజినెస్‌ను ఉధృతం చేస్తున్నాయి. టాటా, బజాజ్, కేపిటల్, ముత్తూట్ వంటి సంస్థలతో పాటు ఎలాంటి అనుమతులూ లేని లోన్ యాప్‌లు రంగం మీదికొచ్చి అధిక వడ్డీలకు అప్పులను అంటగడుతున్నాయి. ఇటీవలి కాలంలో లోన్ యాప్‌ల బారిన పడి ఆత్మహత్యలు చేసుకున్న విషాదాలు చాలా నమోదయ్యాయి. రైతుల, కౌలు రైతుల, వ్యవసాయ కార్మికుల ఆత్మహత్యలకు ప్రైవేటు అప్పులే కారణమని అనేకమార్లు రుజువైంది. అప్పుల బాధ భరించలేక కుటుంబాలకు కుటుంబాలు సామూహిక బలవన్మరణాలకు పాల్పడుతున్న సంఘటనలు తరచు చూస్తున్నాం. మైక్రోలు, అన్ని రకాల ప్రైవేటు వడ్డీ వ్యాపార సంస్థలు, వ్యక్తులు, లోన్‌యప్‌లపై పటిష్టమైన ప్రభుత్వ నియంత్రణ ఉన్నప్పుడే అరాచకాలు కొంతైనా కట్టడవుతాయి. ప్రభుత్వం, బ్యాంకులు తక్కువ వడ్డీలకు పేదలు, సామాన్యులకు సులభతరంగా పరపతి సౌకర్యం కల్పిస్తే ప్రజలకు కాబూలీల అవసరం ఉండదు. కిరాతకాలకు పాల్పడుతున్న ఫైనాన్స్ సంస్థల, వాటి ప్రతినిధులను కఠినంగా శిక్షిస్తేనే దౌర్జన్యాలు, దాష్టీకాలు ఆగుతాయి. ప్రభుత్వం తక్షణం దృష్టి సారించడం అవశ్యం.

మంచి మాట



తన ఉనికికే ప్రమాదం వస్తోందని తెలుసుకున్న పాలక వర్గం... తన అధికారాలను అంటిపెట్టుకోవడానికి మతాన్ని పావుగా ఉపయోగించుకుంటుంది.

- ఆగస్టు బెబెల్,
జర్మన్ సోషలిస్ట్ రాజకీయవేత్త, రచయిత, వక్త.

జూన్ 25: గుర్తుంచుకోవలసిన ప్రతిఘటనా దినం

సందర్భం

బి.వి.రాఘవులు



1975 జూన్ 25/26 నాకు ఇంకా బాగా జ్ఞాపకం ఉంది. అది డిగ్రీ పరీక్షల చివరి రోజు. నేను మార్క్సిస్టు పార్టీ పూర్తి కాలం కార్యకర్తగా వచ్చిన రోజు. ఆ రోజు నిరంకుశత్వం దేశాన్ని అంధకారంలో ముంచిన రోజు. ఆ రోజును నేను మర్చిపోను. మనలో ఎవరూ కూడా మర్చిపోకూడదు.

శ్రీమతి ఇందిరా గాంధీ ప్రధాన మంత్రిగా ఉన్న ఆనాటి కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం జూన్ 25 అర్ధరాత్రి దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. వందలాది మంది ప్రతిపక్ష నాయకులను రాత్రికి రాత్రి అరెస్టు చేసి జైళ్ళలో కుక్కింది. పత్రికల నోరు నొక్కింది. సెన్సార్‌షిప్ విధించింది. సమ్మెలను నిషేధించింది. వందలాది కార్మిక నాయకులను చెరసాలలో వేసింది. విద్యార్థి నాయకులను నిర్బంధించింది. నిరసన తెలిపే హక్కును కూడా తొలగించారు. ఎన్నికలు రద్దు చేశారు. వేతనాలను స్తంభింపచేశారు. సెలవులలో కోత పెట్టారు. లే ఆఫ్‌లను చట్టబద్ధం చేశారు. కరువు భత్యాన్ని సగానికి తగ్గించారు. రాత్రికి రాత్రే ప్రాథమిక హక్కులు తుడిచిపెట్టబడ్డాయి. మురికివాడలను, గుడిసెలను నేలమట్టం చేశారు. ఒక్క ఢిల్లీ నగరంలోనే 1,50,105 ఇళ్లను కూల్చివేశారు. దేశ వ్యాప్తంగా బలవంతపు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిగాయి. లక్ష మందికి పైగా ప్రతిపక్ష నాయకులను, కాంగ్రెస్‌లోని అసమ్మతి వాదులను రాత్రికి, రాత్రే అరెస్ట్ చేసి జైలులో పెట్టారు. వందలాది మంది జర్నలిస్టులు, ట్రేడ్ యూనియన్ వాదులు, విద్యార్థి నాయకులు, రాజకీయ పార్టీల కార్యకర్తలను నిర్బంధించారు. మిసా, డిఐఎస్‌ఐఆర్, సిఓఎఫ్‌ఇపిఓఎస్‌ఎ అనే క్రూరమైన చట్టాలు ప్రజలను విచారణ లేకుండా జైలులో పెట్టడానికి ఉపయోగించారు. మిసా కింద 34,988 మందిని, డిఐఎస్‌ఐఆర్ కింద 75,818 మందిని నిర్బంధించారని ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. చాలా మందిని కస్టడీలో హింసించారు. కొందర్ని చంపారు కూడా! 1976 మార్చి 1న కాలికట్ రీజినల్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి పి.రాజన్‌ను కస్టడీలో చంపడం నాటి క్రూరత్వానికి ఒక చిహ్నం. నా విద్యార్థి ఉద్యమ సహచరుడు, రూమ్ మేట్ అయిన నాయకుడ్ని, ఆయనతో గదిలో నిద్రిస్తున్న గెస్టును కూడా అరెస్టు చేసి జైల్లో పెట్టారు. గెస్టు సౌకర్యం కోసం పడుకునేందుకు వేరే రూమ్‌కు వెళ్ళిన నేను తప్పించుకున్నాను.

అర్ధరాత్రి అకస్మాత్తుగా అత్యవసర పరిస్థితి విధించడంతో దేశం దిగ్భ్రాంతికి గురైంది. కానీ పెరుగుతున్న నిరంకుశత్వపు ముప్పు గురించి సిపిఎం చాలా కాలం క్రితమే హెచ్చరించింది. 1972 మదురై మహాసభ లోనే భారతదేశం ఏక పార్టీ నిరంకుశత్వం వైపు పయనిస్తోందని, అణచివేతకు సిపిఎం ప్రధాన లక్ష్యమవుతుందని పేర్కొన్న పార్టీ రానున్న రోజులలో ఈ నిర్బంధం అందరి మీదకు వస్తుందని హెచ్చరించింది. ఆ కాలంలో పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్ మూకలు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం సాయంతో అర్థ ఫాసిస్టు నిర్బంధానికి దిగాయి. మన సహచరులను అనేకమందిని హత్య చేశారు. కేరళలో కూడా అదే కాంగ్రెస్ పాలనలో మన కార్యకర్తలు చాలా మంది హత్యలకు గురయ్యారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగిన ప్రజా పోరాటాలలో సిపిఎం ముందంజలో ఉన్నందున దానినే లక్ష్యంగా చేసుకున్నారు. ఈ నిరంకుశత్వం కొనసాగింపే దేశానికి విస్తరించి ఎమర్జెన్సీ రూపంలో ప్రజాస్వామ్యాన్ని హరించింది.



> ఆనాటి కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం జూన్ 25 అర్ధరాత్రి దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. వందలాది మంది ప్రతిపక్ష నాయకులను రాత్రికి రాత్రి అరెస్టు చేసి జైళ్ళలో కుక్కింది. పత్రికల నోరు నొక్కింది. సెన్సార్‌షిప్ విధించింది. సమ్మెలను నిషేధించింది. వందలాది కార్మిక నాయకులను చెరసాలలో వేసింది. విద్యార్థి నాయకులను నిర్బంధించింది. నిరసన తెలిపే హక్కును కూడా తొలగించారు. ఎన్నికలు రద్దు చేశారు. వేతనాలను స్తంభింపచేశారు. సెలవులలో కోత పెట్టారు. లే ఆఫ్‌లను చట్టబద్ధం చేశారు. కరువు భత్యాన్ని సగానికి తగ్గించారు. రాత్రికి రాత్రే ప్రాథమిక హక్కులు తుడిచిపెట్టబడ్డాయి. మురికివాడలను, గుడిసెలను నేలమట్టం చేశారు. ఒక్క ఢిల్లీ నగరంలోనే 1,50,105 ఇళ్లను కూల్చివేశారు. దేశ వ్యాప్తంగా బలవంతపు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిగాయి. లక్ష మందికి పైగా ప్రతిపక్ష నాయకులను, కాంగ్రెస్‌లోని అసమ్మతి వాదులను రాత్రికి, రాత్రే అరెస్ట్ చేసి జైలులో పెట్టారు. వందలాది మంది జర్నలిస్టులు, ట్రేడ్ యూనియన్ వాదులు, విద్యార్థి నాయకులు, రాజకీయ పార్టీల కార్యకర్తలను నిర్బంధించారు. మిసా, డిఐఎస్‌ఐఆర్, సిఓఎఫ్‌ఇపిఓఎస్‌ఎ అనే క్రూరమైన చట్టాలు ప్రజలను విచారణ లేకుండా జైలులో పెట్టడానికి ఉపయోగించారు. మిసా కింద 34,988 మందిని, డిఐఎస్‌ఐఆర్ కింద 75,818 మందిని నిర్బంధించారని ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. చాలా మందిని కస్టడీలో హింసించారు. కొందర్ని చంపారు కూడా!

నిర్బంధంతో, నిరంకుశత్వంతో అధికారాన్ని కాపాడుకోగలమని శ్రీమతి ఇందిరా గాంధీ భావించారు. కానీ ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి సిద్ధమయ్యారు. ఎమర్జెన్సీకి అధికార ముద్ర వేయడానికి సమావేశమైన పార్లమెంటులో ప్రతిఘటనా స్వరాన్ని సిపిఎం నేత కామ్రేడ్ ఎ.కె.గోపాలన్ వినిపించారు. ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ ఆయన చేసిన ప్రసంగాన్ని ముద్రించి రహస్యంగా విద్యార్థుల్లో పంపిణీ చేసిన విషయం నాకింకా గుర్తుంది.

కొన్ని వార్తా పత్రికలు కూడా తమ ప్రతీకాత్మక చర్యల ద్వారా నిరసనను తెలియచేశాయి. జూన్ 26న 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా' 'డెమోక్రసీ, బిలవ్డ్ హజ్బెండ్ ఆఫ్ ట్రూత్, లవింగ్ ఫాదర్ ఆఫ్ లిబర్టీ, బ్రదర్ ఆఫ్ ఫెయిత్, హోప్ అండ్ జస్టిస్ ఎక్స్‌పైర్డ్ ఆన్ జూన్ 26' అనే శీర్షికతో సంస్మరణ ప్రకటనను ప్రచురించింది. జూన్ 28న 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ఖాళీ సంపాదకీయాన్ని ప్రచురించింది. ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ రవీంద్రనాథ్ టాగూర్ రాసిన 'వేర్ ది మైండ్ ఈజ్ వితవుట్ ఫియర్' పద్యాన్ని పునర్ముద్రించింది. సిపిఎంకు చెందిన వివిధ ప్రచురణలు తమ కాలమ్‌ల ద్వారా సెన్సార్‌షిప్‌ను, రాజ్యం యొక్క అణచి వేత చర్యలను తీవ్రంగా నిరసిస్తూనే ఉన్నాయి.

> ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ 21 నెలలు కొనసాగింది. మోడీ అప్రకటిత ఎమర్జెన్సీ పదకొండవ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. ప్రధాన మీడియా మోడీ ప్రచార సాధనంగా మారింది. ఉద్యమాలను అణిచివేయడం, విమర్శకులను అణచి వేయడం, ప్రజాస్వామ్య సంస్థలను నిర్వీర్యం చేయడం, నిఘాను కొనసాగించడం వంటి కొత్త ఫాసిస్ట్ పరిస్థితిని క్రమపద్ధతిలో ప్రస్తుతం అమలు చేస్తున్నారు. ముఖ్యంగా కమ్యూనిస్టులు, మైనారిటీలు, లౌకిక శక్తులను ఈ అణచివేతకు లక్ష్యంగా చేసుకున్నారు.

సహజంగానే ప్రతిఘటనలో కేరళ అగ్ర భాగాన ఉంది. ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసన తెలియచేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సిపిఎంపై, ప్రజా ఉద్యమాలపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించింది. అచ్యుతానందన్, పినరయి విజయన్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేశారు. పినరయి క్రూరమైన థర్డ్ డిగ్రీ హింసకు గురయ్యారు. హింస అణచివేతకు ఒక సాధారణ సాధనంగా మారింది. అయితే కేరళ నుండి వచ్చిన ఈ ప్రతిఘటనోద్యమం దేశానికే ఉత్తేజాన్నిచ్చింది. అందుకు జేజేలు తెలియ జేస్తున్నాను. ప్రజా ఉద్యమాలు, ప్రజా ఒత్తిడికి ఇందిరా గాంధీ తలొగ్గక తప్పలేదు. 1977 మార్చి 21న ఆమె ఎమర్జెన్సీని ఎత్తి వేశారు. తీవ్రమైన ప్రజాగ్రహానికి గురయిన ఆమె ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు.

అయితే, అన్ని రాజకీయ శక్తులు ఎమర్జెన్సీని ప్రతిఘటించలేదు. భారతీయ జనసంఘ్ (బిజెపి పూర్వ రూపం) అగ్ర నాయకత్వం నాటి ప్రభుత్వం ముందు లొంగిపోయింది. ది హిందూలో ప్రచురితమైన తన 2,000వ వ్యాసం 'అన్‌లెరన్డ్ లెసన్స్ ఆఫ్ ది ఎమర్జెన్సీ'లో డాక్టర్ సుబ్రమణ్యన్ స్వామి ఆర్‌ఎస్‌ఎస్, బిజెఎస్‌లకు చెందిన నాయకులు ఇందిరా గాంధీతో ఎందరు రహస్య చర్చలు చేశారో సవివరంగా రాశారు. పాలకులతోనూ, పాలనా యంత్రాంగంతోనూ ఆర్‌ఎస్‌ఎస్ చాలా త్వరగా సుహృద్భావ సంబంధాలను పెట్టుకుంది. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ బాలా సాహెబ్ దేవరస్ ఇందిరా గాంధీకి మద్దతు ఇస్తూ రాసిన లేఖలు ప్రజా క్షేత్రంలో ఉన్నాయి. వామపక్షాలతో పాటు ఇతర ప్రతిపక్ష శక్తులకు చెందిన వేలాది మంది కార్యకర్తలు జైలు పాలై, చిత్ర హింసలకు గురయ్యారు. అదే సమయంలో సంఘ్ అగ్ర నాయకులు మాత్రం తప్పించుకున్నారు. ఎమర్జెన్సీని ప్రతిఘటించడంలో తాము కూడా భాగమయ్యామని చెప్పుకునే నైతిక హక్కు నేడు బిజెపికి లేదు.

అయినప్పటికీ, అదే బిజెపి ఇప్పుడు జూన్ 25ను 'సంవిధాన్ హత్య దివస్' (రాజ్యాంగ హత్య దినం)గా ప్రకటిస్తోంది. మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలను ఈ రోజుకు గుర్తుగా ఏడాది పొడవునా ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించింది. అత్యవసర పరిస్థితిని వ్యతిరేకించిన వారిని గౌరవించడానికి మరియు రాజ్యాంగాన్ని బలహీనపరచడం వల్ల కలిగే ప్రమాదాలను ఎత్తిచూపడానికి ఈ కార్యక్రమాలను చేపట్టాలని సూచించింది. కానీ ఇది ఒక క్రూర పరిహాసం. అత్యవసర పరిస్థితిలో లొంగిపోయిన వారు ఇప్పుడు తమను తాము ప్రజాస్వామ్య రక్షకులుగా చెప్పుకుంటున్నారు. ఎవరో సరిగ్గానే చెప్పినట్లు "రాజ్యాంగాన్ని వధించిన వారే ఇప్పుడు దాని గొప్పతనాన్ని ప్రశంసిస్తూ పాడుతున్నారు. దాని సంరక్షకులుగా నటిస్తున్నారు." వాస్తవానికి, మోడీ పాలనలో నేడు మనం చూస్తున్నది 'ఎమర్జెన్సీ నాటి నిరంకుశత్వపు పునరుద్ధరణ'. అయితే ఈసారి దానిని అధికారికంగా ప్రకటించలేదు. కానీ, 1975 అత్యవసర పరిస్థితి నాటి ప్రతి భయానక ఘట్టం ఇప్పుడు పునరావృతమవుతోంది. విస్తృతమవుతోంది!

నిజానికి గత పదకొండు సంవత్సరాలలో ఒక పద్ధతి ప్రకారం జరిగిన మానవ హక్కుల ఉల్లంఘనలు అత్యవసర పరిస్థితిని ప్రతి విషయంలోనూ ప్రతిబింబిస్తాయి. నేటి 'ఉపా' అప్పట్లో 'మిసా' పోషించిన పాత్రనే పోషిస్తోంది. మునుపటిలాగే, రచయితలు, జర్నలిస్టులు, విద్యార్థులు, రాజకీయ ప్రత్యర్థులు, భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసే గొంతులను అణచివేస్తున్నారు. ప్రబీర్ పుర్కాయస్థ 1975లోనూ, 2023లోనూ అరెస్టు చేయబడి భారత ప్రజాస్వామ్యంలోని రెండు చీకటి అధ్యాయాలకు (1975-77, 2014 -2025. సజీవ చిహ్నంగా నిలుస్తున్నారు. 2024 ఎన్నికల సమయంలో, మోడీ పాలన ఇద్దరు సిట్టింగ్ ముఖ్యమంత్రులను అరెస్టు చేసింది. ప్రతిపక్ష నాయకులను భయపెట్టడానికి, ఒత్తిడికి గురిచేయడానికి దర్యాప్తు సంస్థలను ఉపయోగించింది. పార్టీని ఫిరాయింపచేయడం లేదా లొంగిపోవడం లక్ష్యంగా ఈ వేధింపులు కొనసాగాయి. మూక హత్యలు, ద్వేషపూరిత ప్రచారాలు, మైనారిటీ ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేయడం, రాజ్య మద్దతుతో కూడిన నిఘా, హింస మోడీ పాలనలో సాధారణ అంశాలుగా మారాయి. విశ్వవిద్యాలయాల నుండి మురికివాడల వరకు అన్ని ప్రాంతాల్లోనూ నిరసనను, అసమ్మతిని అణచివేస్తున్నారు.

ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ 21 నెలలు కొనసాగింది. మోడీ అప్రకటిత ఎమర్జెన్సీ పదకొండవ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. ప్రధాన మీడియా మోడీ ప్రచార సాధనంగా మారింది. ఉద్యమాలను అణిచివేయడం, విమర్శకులను అణచి వేయడం, ప్రజాస్వామ్య సంస్థలను నిర్వీర్యం చేయడం, నిఘాను కొనసాగించడం వంటి కొత్త ఫాసిస్ట్ పరిస్థితిని ఒక క్రమపద్ధతిలో ప్రస్తుతం అమలు చేస్తున్నారు. ముఖ్యంగా కమ్యూనిస్టులు, మైనారిటీలు, లౌకిక శక్తులను ఈ అణచివేతకు లక్ష్యంగా చేసుకున్నారు.

పెద్ద పెట్టుబడిదారులు, భూస్వాములు తమ వర్గ ప్రయోజనాలను కాపాడుకోవడానికి నిరంకుశ శక్తులకు మద్దతు ఇస్తారని సిపిఎం ఎల్లప్పుడూ హెచ్చరిస్తూనే ఉంది. 1975లో కూడా, గుత్తాధిపత్య పెట్టుబడిదారుల్లో ఒక విభాగం అత్యవసర పరిస్థితిని స్వాగతించింది. 'పార్లమెంటరీ వ్యవస్థ మన ప్రజలకు సరిపోదు'అని నాడు టాటా అన్నారు. నేడు, మోడీ పాలనలో లౌకికవాదం, సమాఖ్యవాదం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం యొక్క పునాదులను నాశనం చేసే ప్రాజెక్ట్‌లో మతతత్వ శక్తులతో కార్పొరేట్ ప్రపంచంలోని చాలా భాగం చేతులు కలిపింది.

అప్పుడు ఎమర్జెన్సీతో పోరాడి ఓడించినట్లే, మనం మళ్లీ కదలాలి. నిరంకుశత్వాన్ని నిరోధించడానికి, రాజ్యాంగంలో పేర్కొన్న ప్రాథమిక విలువలను రక్షించడానికి లౌకిక, ప్రజాస్వామ్య శక్తులను సిపిఎం మరోసారి సమీకరిస్తోంది. 50 సంవత్సరాల తరువాత అత్యవసర పరిస్థితిని గుర్తుంచుకోవడం కేవలం చరిత్రను జ్ఞాపకం చేసుకోవడం కోసం కాదు. పెరుగుతున్న మతతత్వ, నయా ఫాసిస్టు శక్తుల నుండి మన గణతంత్రాన్ని రక్షించుకోవాలనే మన సంకల్పాన్ని మరింతగా బలోపేతం చేసుకోవడానికి ఇది ఓ క్రియాశీల పిలుపు!

/ వ్యాసకర్త సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు /

అభిప్రాయం

ఆర్భాటమే



జలంధర్ ఎన్.ఐ.టి.లో బీటెక్ పూర్తి చేసుకొని విశాఖపట్నం చేరుకున్న నాకు...ఎక్కడ చూసినా యోగా దినోత్సవ హడావిడి కనిపించింది. రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో పెద్ద ఎత్తున యోగా డే నిర్వహించి గిన్నిస్ రికార్డ్ సాధించాలనుకుంటోందని, ఇదంతా అందుకోసమేనని తెలిసింది. ఈ ఆర్భాటం చూసి, నాక్కూడా 'యోగాంధ్ర' వేడుకల్లో పాల్గొనాలనిపించింది. అయితే, గతంలో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ వాలంటీర్‌గా పని చేసిన అనుభవం వున్న నేను...అక్కడకు వచ్చే వారికి సహాయం చేయటానికి వాలంటీర్‌గా వెళ్తే నయమనుకుని మిత్రులతో కలిసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాను.

యోగ డే ముందు రోజు సాయంత్రానికే వాలంటీర్లు హాజరు కావాలని అధికారులు ఆదేశించడంతో అందరం ఆంధ్ర యూనివర్సిటీ గ్రౌండ్స్‌కు చేరుకున్నాం. వాలంటీర్లు నిర్వహించాల్సిన కర్తవ్యాలు, సూచనలు అధికారులు మాకు తెలియజేశాక... అదే రోజు రాత్రి ఎండాడ లోని లా కాలేజీ దగ్గర మాకు కేటాయించిన కంపార్ట్‌మెంట్లకు మమ్మల్ని తరలించారు. రాత్రంతా నిద్ర లేకపోయినా, తెల్లవారుజామున 3 గంటల నుండే దూర ప్రాంతాల నుంచి ఆయా కంపార్ట్‌మెంట్లకు బస్సుల ద్వారా వచ్చిన విద్యార్థులు, ప్రజలకు క్యూఆర్ కోడ్ వేసి వారి వారి స్థానాలకు చేరవేశాం. తెల్లవారే కొద్దీ బస్సుల్లో వస్తున్న వారి సంఖ్య విపరీతంగా పెరిగింది. కంపార్ట్‌మెంట్లో కేటాయించిన సీట్ల కంటే వందలాది మంది అత్యధికంగా చేరుకోవడంతో ఇరుగ్గానే కూర్చోపెట్టాల్సి వచ్చింది.

మరోవైపు యోగ డే గుర్తుగా ప్రభుత్వం అందజేస్తున్న టీ షర్టులు, యోగా మ్యాట్ల కోసం అనేకమంది ఎగబడి కొట్లాటల దాకా వెళ్లింది. ఈ వీడియోలు సోషల్ మీడియాలో మీమ్ లుగా వైరల్ అయ్యాయి. ముందు రోజు నుంచే వచ్చిన విద్యార్థులు నిద్ర లేక నీరసించి యోగా మ్యాట్ల పైనే నిద్రించాల్సి వచ్చింది. వాలంటీర్లుగా ఉన్న మేము వీరందరికీ నిర్వాహకులు సప్లై చేసిన అరకొర మంచినీళ్ళు, ఆహార పదార్థాలు అందజేశాం. నీరసించిన విద్యార్థులు మా వాలంటీర్ల దగ్గరకు వచ్చి "అన్నా! తినటానికి ఏమైనా ఉంటే ఇవ్వండి" అనడిగినా, ఇవ్వడానికి సప్లై లేకపోవడంతో మనసు చివుక్కుమన్నది. ఒక గంట యోగ ప్రోగ్రాం కోసం నెల రోజుల పాటు రాష్ట్రంలోని అధికారి యంత్రాంగం అంతా శ్రమించడం, లక్షలాది మంది ప్రజలను నిద్రాహారాలు లేకుండా తరలించడం, అరకొర ఏర్పాట్లతో సరిపెట్టడం అవసరమా అనిపించింది.

అంత పెద్ద ఎత్తున రికార్డ్ స్థాయిలో ప్రజలను సమీకరించినప్పుడు దానికి తగిన ఏర్పాట్లు చేయటంలో ప్రభుత్వం విఫలమైనట్లు కనిపించింది. ముఖ్యంగా సుదూర ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు, ప్రజలకు తగిన ఆహారం, నీళ్ళ, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలు సరిపడా లేక తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. సుమారు 150 కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చు పెట్టి, 3 లక్షల పైగా ప్రజలను సమీకరించి, రాష్ట్రంలోని వేలాది ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు ఇక్కడికి రావడంతో విశాఖపట్నం ఒక్కసారిగా కిటకిటలాడింది.

యోగా ప్రారంభానికి ముందు ప్రధాని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చేసిన ప్రసంగాల సంగతి సరేసరి. రోజూ ఒక గంట పాటు యోగా చెయ్యాలని చెప్పారు. కానీ 8 గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచడం ద్వారా, ప్రజలకు యోగా చేసే ఆ గంట సమయాన్ని కూడా లేకుండా చేశామన్నది గుర్తించకపోవడం శోచనీయం.

మొత్తంమీద యోగా కార్యక్రమం ఒక తంతుగా ముగిసింది. అసలు కష్టాలు ఆ తర్వాతే మొదలయ్యాయి. వేలాది బస్సులు, లక్షలాది మంది ప్రజలు యోగ వేడుక ముగిసిన తర్వాత ఒక్కసారిగా బయలుదేరడంతో కిలోమీటర్ల కొలది ట్రాఫిక్ జామై ప్రజలు తీవ్ర అసహనానికి గురి కావాల్సి వచ్చింది. వాలంటీర్లుగా ఉండే మాక్కూడా తిరుగు ప్రయాణంలో కనీస బస్సు సౌకర్యాలు లేక చాలా దూరం నడవాల్సి వచ్చింది. నిద్రాహారాలు సరిగ్గా లేని విద్యార్థులు అనేకమంది బస్సుల్లోనే వాంతులు చేసుకుని అనారోగ్యానికి గురయ్యారు. సుమారు మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా విశాఖపట్నం నుంచి అటు అనకాపల్లి ఇటు సబ్బవరం, పెందుర్తి, భోగాపురం వరకు కూడా ఈ ట్రాఫిక్ కష్టాల్లో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. ఆరోగ్య సంరక్షణకు అని చెప్పున్న యోగా డే అనేకమైన ఆరోగ్య సమస్యల నిలయంగా మార్చిన ప్రభుత్వ చర్యలను ప్రజలు విమర్శించడం కనిపించింది. అలాగే ఇటువంటి కార్యక్రమాల కోసం సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థుల్ని తరలించకపోవడమే మంచిదనిపించింది. ఈ యోగా డే లో ఎంతో ఉత్సాహంగా వాలంటీర్‌గా పాల్గొని ప్రజలకు కాస్తో కూస్తో సహాయ పడాలనే ఆలోచన చేసినా ఆచరణలో సాధ్యం కాకపోవడంతో నిరాశతో ఇంటికి వెనుతిరిగాను. 'వన్ ఎర్త్ - వన్ హెల్త్' నినాదం ప్రచారార్భాటమేనని గుర్తించాను.

- రిఖిల్ వి,
సెల్ : 8639493545

సమస్య

యోగాంధ్ర సరే! ఉపాధి సంగతో?

యోగా దినోత్సవం సందర్భంగా విశాఖలో 3 లక్షలకు పైగా ప్రజలు పాల్గొన్నారని, గిన్నిస్ రికార్డు సృష్టించామని చెప్తున్నారు నేతలు. దీనికోసం కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని వృధా చేశారు. నిధులు లేక రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులు పడుతున్నదని చంద్రబాబు గతంలో చెప్పారు. ఇంకోవైపు మోడీ మన్ననలు పొందడానికి అట్టహాసంగా నెల రోజుల నుండి అధికారులు, పోలీసులు, యంత్రాంగం మొత్తం యోగా ఏర్పాట్ల పనిలో పడింది. యోగా చేసిన వారిలో యువత కూడా ఉన్నారు. విశాఖ వచ్చిన ప్రధాని మోడీని స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం ప్రకటన చేయాలని అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ అంశం పైన ఆయన నోరు మెదపలేదు. గతంలో రాష్ట్రానికి వచ్చినప్పుడు మట్టి, చెంబుడు నీరు తప్ప ఏమీ ఇవ్వలేదు. ఇప్పుడు కూడా ఉత్త చేతులే చూపారు.



ఉపాధి లేనివారు రాష్ట్రంలో ఎంతమంది ఉన్నారో తెలుసుకోవటానికి సచివాలయ ఉద్యోగులతో సర్వే చేయించారు. వారు అందచేసిన గణాంకాల ప్రకారం జిల్లాల వారీగా ఉపాధి లేని వారి వివరాలు ఇలా వున్నాయి (లక్షల్లో). అనకాపల్లి 5.43 లక్షలు, అనంతపురం 7.24, అన్నమయ్య 5.22, బాపట్ల 5.17, చిత్తూరు 6.10, అంబేద్కర్ కోనసీమ 6.17, తూర్పు గోదావరి 5.36, ఏలూరు 6.37, గుంటూరు 5.86, కాకినాడ 6.49, కృష్ణా 4.20, కర్నూలు 7.62, నంద్యాల 5.91, ఎన్టీఆర్ 5.99, పల్నాడు 5.87, పార్వతీపురం మన్యం 3.38, ప్రకాశం 7.00, నెల్లూరు 7.48, సత్యసాయి 6.17, శ్రీకాకుళం 7.56, తిరుపతి 6.46, విశాఖపట్నం 5.56, విజయనగరం 6.93, పశ్చిమ గోదావరి 5.68, వైఎస్సార్ జిల్లా 6.28, అల్లూరి జిల్లా 4.89 లక్షలు వున్నారు.

ఈ సర్వేలో ఏ ఉపాధీ లేని వాళ్ళు 1.56 కోట్ల మంది. ఎలాంటి ఉపాధి లేని వాళ్ళు ఎక్కువగా ఉన్న మొదటి ఐదు జిల్లాలు కర్నూలు, శ్రీకాకుళం, నెల్లూరు, అనంతపురం, ప్రకాశం. కర్నూలు జిల్లాలో అత్యధికంగా 7.62 లక్షల మందితో మొదటి స్థానంలో ఉంది. ప్రతి జిల్లాలోనూ 5 లక్షల వరకు ఉపాధి లేని వారు ఉన్నారు. వీరి సంగతేంటి?

దేశంలో 15-29 ఏళ్ళ వయసున్న వారిలో నిరుద్యోగ రేటు 13.8 శాతం ఉంది. పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగ రేటు 17.2 శాతం కాగా గ్రామీణ ప్రాంతాల్లో 12.3 శాతం ఉంది. 15-29 ఏళ్ళ లోని మహిళల్లో నిరుద్యోగ రేటు దేశవ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలు కలిపి 14.4 శాతం. విడిగా చూస్తే పట్టణాల్లో 23.7 శాతం, గ్రామాల్లో 10.7 శాతంగా ఉంది. ఇదే వయసులోని పురుషుల్లో మొత్తం మీద 13.6 శాతం నిరుద్యోగ రేటు ఉంది (పట్టణాల్లో 15 శాతం, గ్రామాల్లో 13 శాతం). ఈ గణాంకాలను చూస్తే నిరుద్యోగం ఎంత తీవ్రంగా ఉందో అర్థం అవుతుంది.

ఎన్నికల ముందు హామీల వర్షం. తర్వాత యువతని పట్టించుకోని పరిస్థితి. ఎన్నికల ముందు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఇచ్చారు మోడీ. 11 ఏళ్ల మోడీ పాలన అంటే 22 కోట్ల ఉద్యోగాలు యువతకు బాకీ పడ్డారు. మరి మోడీ తర్వాత ఎన్ని కోట్ల ఉద్యోగాలు ఇచ్చారో లెక్కలు మాత్రం ఇవ్వరు. ఉన్న ఉద్యోగాలు కూడా పోయాయి. ఏ దేశంలో అయితే నిరుద్యోగం ఎక్కువ ఉంటుందో ఆ దేశం అభివృద్ధి చెందదు. ప్రభుత్వాలు ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగ సమస్యను తీర్చడం లేదు. ఉన్నత చదువులు పూర్తి చేసిన పిహెచ్.డి డిగ్రీలు చేసిన వారు సైతం ప్యూన్, స్వీపర్ లాంటి ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. ఉత్తరప్రదేశ్‌లో ప్యూన్ జాబ్‌కి 93 వేల మంది అప్లై చేస్తే అందులో 3700 మంది పిహెచ్.డి చేసిన వారు. దేశంలో ప్రతి సంవత్సరం 20 లక్షల మంది డిగ్రీలు చదివిన వారు, 5 లక్షల మంది పీజీలు చేసిన వారు సైతం నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. వ్యవసాయ ఆధారిత దేశంలో వ్యవసాయం చేసే వారు సీజనల్‌గా నిరుద్యోగాన్ని ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ రంగంలో 2013-14 నుండి 2015-2016 మధ్యలో 2.60 కోట్ల ఉద్యోగాలు పోయాయి. ఆ సంఖ్య ప్రస్తుతం ఇంకా పెరిగే అవకాశం ఉంది. నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. 37.4 శాతం నిరుద్యోగంతో హర్యానా దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. నిరుద్యోగం ఏపీలో 7.7 శాతం ఉంటే తెలంగాణలో 4.1 శాతం ఉంది. పెట్టుబడిదారులు కార్మికుల జీతాలను నియంత్రించడానికి నిరుద్యోగాన్ని ఉపయోగిస్తారు. పని లేకపోవడం వల్ల కార్మికుల తమ హక్కుల కోసం పోరాటం చేయడానికి వెనుకడుగు వేస్తారు. కార్మికుల మధ్య పోటీ పెరుగుతుంది. బేరసారాల శక్తి తగ్గుతుంది. చీప్ లేబర్‌గా మారాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. రిజర్వ్ ఆర్మీ ఆఫ్ లేబర్ వస్తుందని కారల్ మార్క్స్ ఏనాడో చెప్పారు. ఈ సమస్యలకు పరిష్కారం ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉన్న నాడే జరుగుతుంది.

- యు.ఎస్.ఎన్. రాజు,
డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు

నాన్ గెజిటెడ్ ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి

- రైల్వే బోర్డుకు సిఐటియు లేఖ

న్యూఢిల్లీ : రైల్వేలో నాన్ గెజిటెడ్ ఖాళీ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో తిరిగి నియమించుకోవాలంటూ రైల్వే బోర్డు జారీ చేసిన ఆదేశాలను సిఐటియు తీవ్రంగా నిరసించింది. పే లెవల్-1 నుండి పే లెవల్-9కి మధ్యలో గల నాన్ గెజిటెడ్ ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఈ నెల 20న రైల్వే బోర్డుకు లేఖ రాసింది. మంజూరైన పోస్టులను తిరిగి సరెండర్ చేయడంతో సిబ్బంది కొరత సమస్యను పరిష్కరించేందుకు ఖాళీగా వున్న పోస్టుల్లో తక్షణమే రిక్రూట్‌మెంట్ ప్రక్రియను చేపట్టాలని సిఐటియు ఆ లేఖలో కోరింది. రిటైరైన సిబ్బందిని తిరిగి నియమించుకునే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరింది. రైల్వేలో మొత్తంగా రెండున్నర నుండి మూడు లక్షల వరకు గల ఖాళీలను భర్తీ చేయడానికి బదులుగా రిటైరైన సిబ్బందిని నియమించడం నిరుద్యోగ యువతను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని సిఐటియు విమర్శించింది. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామంటూ ఎన్నికల వాగ్దానాలు చేసిన మోడీ ప్రభుత్వం యువతకు ఉద్యోగాలివ్వడాన్ని విస్మరించిందని విమర్శించింది. కాంట్రాక్ట్ లేబర్ కంటే అధ్వాన్నంగా అధికారాల రిటైరైన వారిని తిరిగి నియమిస్తూ ప్రమాదకర స్వభావం కలిగిన ఉద్యోగాలను మరింత పెంచుతోందని విమర్శించింది. రిటైరైన ఉద్యోగులను ఇలా తిరిగి తీసుకుంటూ ఆనారోగ్యకరమైన అనిశ్చితి, తాత్కాలిక, అభద్రతాన్ని కలిగించడం ద్వారా రైల్వే కార్మిక వ్యవస్థ కూర్పును మొత్తంగా నాశనం చేయడానికి ప్రభుత్వం, రైల్వే శాఖ ప్రయత్నిస్తున్నాయని సిఐటియు విమర్శించింది. రైల్వేలో దాదాపు 12 లక్షల మంది రెగ్యులర్ ఉద్యోగులు వుంటే, ఆరు లక్షల మందికి పైగా కాంట్రాక్టు లేబర్ వున్నారని తెలిపింది. రైల్వే శాఖ తీవ్రమైన సిబ్బంది కొరతను ఎదుర్కొంటుండగా, ఉపాధి కోసం కోట్లాదిమంది యువత కూడా ఎదురుతెన్నులు చూస్తున్నారని పేర్కొంది.

ఉపఎన్నికల్లో బిజెపికి ఎదురుదెబ్బ

- ఒక స్థానానికే పరిమితం
- గుజరాత్‌లో ఆప్
- బెంగాల్‌లో టిఎంసి
- కేరళలో యుడిఎఫ్ గెలుపు

న్యూఢిల్లీ, తిరువనంతపురం : నాలుగు రాష్ట్రాల్లోని ఐదు అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో బిజెపికి ఎదురుదెబ్బ తగిలింది. గుజరాత్‌లో రెండు అసెంబ్లీ స్థానాలకు, పంజాబ్, పశ్చిమ బెంగాల్, కేరళలో ఒక్కొక్క అసెంబ్లీ స్థానానికి ఈ నెల 19న ఉప ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. వీటి ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. అధికారంలో ఉన్న పంజాబ్‌లోని అసెంబ్లీ స్థానంతో పాటు, గుజరాత్‌లో ఒక స్థానాన్ని ఆప్ కైవసం చేసుకుంది. గుజరాత్‌లో ఒక స్థానంతో బిజెపి సరిపెట్టుకుంది. పశ్చిమ బెంగాల్‌లో స్థానాన్ని అధికార టిఎంసి నిలబెట్టుకుంది.

నీలంబూర్‌లో యుడిఎఫ్ గెలుపు

కేరళలోని నీలంబూర్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ప్రతిపక్ష యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) అభ్యర్థి ఆర్యదాన్ షౌకత్ 11,077 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఎల్‌డిఎఫ్ అభ్యర్థి ఎం.స్వరాజ్‌కు 66,607 ఓట్లు రాగా, యుడిఎఫ్ అభ్యర్థికి 77,737 ఓట్లు వచ్చాయి. యుడిఎఫ్ అభ్యర్థికి జమాత్ ఇ ఇస్లామి, ఇతర వామపక్ష వ్యతిరేక సంఘాలు, సంస్థలు బహిరంగంగానే మద్దతునిచ్చాయి. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో యుడిఎఫ్‌కు 78,527 ఓట్లు వచ్చాయి. ఎల్‌డిఎఫ్ మద్దతు కలిగిన ఎంఎల్‌ఎ పివి అన్వర్ ఈ ఏడాది జనవరిలో రాజీనామా చేశారు. ఆ కారణంగా నీలంబూర్‌లో ఉప ఎన్నిక అవసరమైంది. టిఎంసి మద్దతుతో పివి అన్వర్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయగా 19,780 ఓట్లు లభించాయి. మతోన్మాద అంశాలపై రాజీ పడకుండా అత్యంత ధైర్యంగా ఈ ఎన్నికలను ఎదుర్కొన్న ఎల్‌డిఎఫ్, జమాత్ ఇ ఇస్లామీతో సహా తీవ్రవాద సంస్థల ఓట్లను ఆమోదించలేదని ప్రతిబింబించింది. మితవాద శక్తులు సంఘటితపడ్డాయి. యుడిఎఫ్ దాదాపు రెండు వేల ఓట్లు తగ్గిపోయాయి. పోలింగ్ ముగిసిన వెంటనే బిజెపి అభ్యర్థి మోహన్ జార్జ్ మాట్లాడుతూ, బిజెపి కార్యకర్తల్లో చాలామంది యుడిఎఫ్‌కు అనుకూలంగా ఓటు వేశారని అంగీకరించారు. తమ ఓట్లలో కూడా ప్రధాన భాగం యుడిఎఫ్‌కు బదిలీ అయిందని ఎస్‌డిపిఐ (ముస్లిం ఛాందవాదుల సంస్థ పాపులర్ ఫ్రంట్ రాజకీయ విభాగం) వెల్లడించింది. వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో, నీలంబూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఎల్‌డిఎఫ్ ఓట్లు 29,911గా వుండగా, ఈ ఎన్నికల్లో గణనీయంగా పెరగడం విశేషం.

గుజరాత్‌లో బిజెపికి ఒక స్థానంలో ఓటమి

అధికారంలో ఉన్న గుజరాత్‌లో రెండు స్థానాలకు ఉప ఎన్నికలు జరిగినా ఒక స్థానంలో గెలవడం, అది కూడా సానుభూతి ఓట్లతో గట్టెక్కడం బిజెపికి ఎదురుదెబ్బగానే విశ్లేషకులు భావిస్తున్నారు. 2022 ఎన్నికల్లో కడి నుంచి విజయం సాధించిన బిజెపి ఎమ్మెల్యే కర్సాన్ సోలంకి మరణంతో ఉప ఎన్నికలు జరగ్గా, ఆ పార్టీ అభ్యర్థి రాజేంద్ర చావ్డ కాంగ్రెస్ అభ్యర్థి రమేష్ చవ్డపై 39 వేల ఓట్ల తేడాతో గెలుపొందారు. విసావదర్‌లో ఆప్ అభ్యర్థి గోపాల్ ఇటాలియా బిజెపి అభ్యర్థి కిరిట్ పటేల్‌పై 17 వేలకు పైగా ఓట్లతో విజయం సాధించారు. ఈ స్థానంలో 2022 ఎన్నికల్లో గెలిచిన ఆప్ ఎమ్మెల్యే భూపేంద్ర భయాని బిజెపిలో చేరడంతో ఇక్కడ ఎన్నికలు జరపాల్సి వచ్చింది. పంజాబ్‌లో లుధియానా వెస్ట్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో ఆప్ అభ్యర్థి, ప్రస్తుత రాజ్యసభ ఎంపి సంజీవ్ అరోరా కాంగ్రెస్ అభ్యర్థి భరత్ భూషణ్ ఆషుపై 10 వేలకు పైగా ఓట్లతో విజయం సాధించారు. పశ్చిమ బెంగాల్‌లోని కాళీగంజ్ అసెంబ్లీ స్థానంలో టిఎంసి అభ్యర్థి అలీఫ్ అహ్మద్ కాంగ్రెస్ అభ్యర్థి కబీల్ ఉద్దీన్ షేక్‌పై 32 వేల ఓట్ల తేడాతో గెలుపొందారు. గత ఎన్నికల్లో విజయం సాధించిన నసీరుద్దీన్ అహ్మద్ మరణంతో ఇక్కడ ఉప ఎన్నిక నిర్వహించారు. గుజరాత్‌లో రెండు స్థానాల్లోనూ కాంగ్రెస్ ఓటమి పాలవడంతో ఆ రాష్ట్ర పిసిసి చీఫ్ శక్తిసిన్హా గోహిల్ తన పదవికి రాజీనామా చేశారు.

ఇరాన్‌కు సాయం చేసేందుకు సిద్ధం : రష్యా

- ఇంధన అస్థిరతపై పుతిన్ ఆందోళన
- ఇరాన్ క్షిపణుల దాడులతో నిలిచిన విద్యుత్ సరఫరా



టెహరాన్, టెల్ అవీవ్ : అనేక రకాలుగా ఇరాన్‌కు సాయం చేయడానికి రష్యా సిద్ధంగా వుందని, టెహరాన్ ఏం కోరుతుందనే దానిపైనే అంతా ఆధారపడి వుంటుందని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ సోమవారం తెలిపారు. మధ్యవర్తిత్వ ప్రయత్నాలు చేస్తామని చెప్పామన్నారు. ఈ యుద్ధంపై తమ వైఖరి ఏమిటో కూడా స్పష్టం చేశామన్నారు. ఈ యుద్ధం నేపథ్యంలో ప్రపంచ ఇంధన మార్కెట్‌లో నెలకొన్న అస్థిర పరిస్థితులపై ప్రధాన చమురు ఉత్పత్తిదారులైన రష్యా, ఇరాక్ ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ మేరకు పుతిన్, ఇరాక్ ప్రధాని మహ్మద్ షియా అల్ సుడాని ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఇరాన్‌పై దురాక్రమణకు పాల్పడటానికి ఎలాంటి ఆధారం లేదని పుతిన్ వ్యాఖ్యానించారు. మాస్కోలో ఇరాన్ విదేశాంగ మంత్రి అరగ్చితో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ సాయం కోసం మాస్కోకు ఇరాన్ విదేశాంగ మంత్రిని పంపారు. ఇరాన్ ప్రజలకు సాయం చేసేందుకు రష్యా సిద్ధంగా వుందని చెప్పారు. ఇరాన్ అణు స్థావరాలపై అమెరికా దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు.

రాజకీయ పరిష్కారానికి రావాలి : చైనా విజ్ఞప్తి

యుద్ధం ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా నివారించేందుకు తక్షణమే ఇరు పక్షాలు ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని చైనా కోరింది. రాజకీయ పరిష్కారాన్ని కనుగొనే పంథాను అనుసరించాలని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి గుయో జియాకున్ కోరారు.

క్షిపణుల దాడితో ఇజ్రాయిల్‌లో నిలిచిన విద్యుత్

ఇరాన్ తాజాగా క్షిపణుల దాడులను ప్రారంభించడంతో ఇజ్రాయిల్ విద్యుత్ సరఫరా సంస్థలు దెబ్బతిన్నాయని తెలుస్తోంది. దక్షిణ ఇజ్రాయిల్‌లోని వ్యూహాత్మక స్థావరానికి సమీపంలో విద్యుత్ సరఫరా దెబ్బతిందని ప్రభుత్వ విద్యుత్ కంపెనీ వెల్లడించింది. ఇజ్రాయిల్ ఎలక్ట్రిక్ కార్పొరేషన్ కేంద్రంపై దాడులతో ఆ ఏరియాలోని పలు కమ్యూనిటీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సోమవారం ఉత్తర ఇజ్రాయిల్‌లోని పలు ప్రాంతాల్లో ఇరాన్ క్షిపణులతో దాడులు జరిపింది.

తనిఖీలకు అనుమతించాలి : ఐఎఇఎ

ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా బాంబు దాడులు జరిపిన నేపథ్యంలో తమ ఇనస్పెక్టర్లను ఆప్రాంతాల్లో తనిఖీలకు అనుమతించాలని అంతర్జాతీయ అణు పర్యవేక్షక సంస్థ ఐఎఇఎ చీఫ్ సోమవారం కోరారు. శుద్ధిచేసిన యురేనియం నిల్వల జాబితాను గమనంలోకి తీసుకునే ప్రయత్నంలో తమను అనుమతించాలన్నారు. తక్షణమే కాల్పుల విరమణ జరపాలని ఇరు పక్షాలను కోరారు. ఫోర్డో కేంద్రంలో గణనీయంగా నష్టం జరిగినట్లు భావిస్తున్నామని ఐఎఇఎ చీఫ్ రాఫెల్ మారియానో గ్రాసీ పేర్కొన్నారు. ఈ మేరకు వియన్నాలో ఆయన ఒక ప్రకటన చేశారు

బూటకపు సమాచారం : భారత్

ఇరాన్‌పై దాడులకు భారత గగనతలాన్ని అమెరికా ఉపయోగించుకుందంటూ వచ్చిన వార్తలను భారత ప్రభుత్వం కొట్టిపారేసింది. ఇవన్నీ నిరాధారమైన, బూటకపు సమాచారమని తేల్చి చెప్పింది. అమెరికా విమానాలు ఉపయోగించుకున్న మార్గాన్ని జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ జనరల్ డాన్ కెయిన్ పత్రికా సమావేశంలో వివరించారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) ఫ్యాక్ట్ చెక్ యూనిట్ దీనిపై ఎక్స్‌లో పోస్టు పెట్టింది.

అల్బా ఖండన

ఇరాన్ అణు కేంద్రాలపై ఆదివారం నాటి అమెరికా దాడిని బొలివారియన్ అలయన్స్ ఫర్ ది పీపుల్స్ ఆఫ్ అవర్ అమెరికా (అల్బా) తీవ్రంగా ఖండించింది. ఈ దాడులపై అంతర్జాతీయ సమాజం తీవ్రంగా స్పందించాలని కోరింది. ఈ అక్రమ, ఏకపక్ష చర్యలను తక్షణమే విరమించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఐక్యరాజ్య సమితి నిబంధనావళిని, అంతర్జాతీయ చట్టాలను, శాంతియుత సహజీవన మౌలిక సూత్రాలను దారుణంగా ఉల్లంఘించడమేనని అల్బా అభిప్రాయపడింది. దేశాల మధ్య శాంతియుత సహజీవనం వుండాలన్న తమ నిబద్ధతను పునరుద్ఘాటించింది.

బెయిల్ కోసం న్యాయస్థానాలకే బురిడీ కొడతారా?

- ఆర్థిక నేరాల్లో నిందితులపై సుప్రీం కోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ : న్యాయస్థానాలకు చెల్లించాల్సిన మొత్తాలను చెల్లిస్తామని స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బెయిల్ పొందిన తర్వాత నిందితులు ఆ మొత్తాలను చెల్లించకుండా నిరాకరిస్తున్న ధోరణిని సుప్రీంకోర్టు తీవ్రంగా వ్యతిరేకించింది. పన్ను ఎగవేత, ఆర్థిక అవకతవకల కేసుల్లోనే ఇలా ఎక్కువగా జరుగుతోందని పేర్కొంది. ఈ వ్యక్తులే మళ్లీ న్యాయస్థానాలను ఆశ్రయించి, బెయిల్ షరతులు కఠినంగా వున్నాయని లేదా తమకు తెలియకుండానే తమ న్యాయవాదులు చేశారని నిందించడం ద్వారా ఈ చెల్లింపులు జరపకుండా మినహాయింపులు కోరుతున్నారని జస్టిస్ కె.వి.విశ్వనాథన్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన బెంచ్ పేర్కొంది. ఇటీవల కాలంలో ఈ తరహా కుట్రలు కోర్టుల్లో బాగా పెరిగాయని జస్టిస్ విశ్వనాథన్ వ్యాఖ్యానించారు. న్యాయస్థానాలతో ఇలాంటి ఆటలు ఆడేందుకు ఎంత మాత్రమూ అనుమతించేది లేదని బెంచ్ పేర్కొంది. రూ.13 కోట్ల మేరకు పన్ను ఎగవేసిన ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు పై వ్యాఖ్యలు చేసింది. ఈ ఏడాది మార్చిలో ఆ వ్యక్తిని అరెస్టు చేశారు. వివాదాస్పద మొత్తంలో కొంత భాగాన్ని చెల్లించానని, బెయిల్ వచ్చిన తర్వాత మరో రెండున్నర కోట్లు చెల్లిస్తానని ఆ వ్యక్తి మద్రాసు హైకోర్టుకు హామీ ఇచ్చి బెయిల్ పొందాడు. ఆ మొత్తాన్ని ఆ వ్యక్తి తిరిగి చెల్లించలేదు. దాంతో హైకోర్టు బెయిల్‌ను రద్దుచేసింది. దీనిపై ఆ వ్యక్తి సుప్రీంను ఆశ్రయించాడు. దానిపై సుప్రీం పై వ్యాఖ్యలు చేసింది.

15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- నలుగురు స్మగ్లర్లు అరెస్టు

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లాలోని శేషాచలం అటవీ పరిధి చంద్రగిరి-శ్రీవారిమెట్టు మార్గంలో నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేసి 15 ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు... టాస్క్‌ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి భాకరాపేట రేంజిలోని నాగపట్ల అటవీ పరిధిలోని శ్రీవారిమె ట్టు నుంచి చంద్రగిరి వెళ్లే మార్గంలో వాహనాల తనిఖీ చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున ఓ కారులోని వ్యక్తులు.. పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. టాస్క్ ఫోర్స్ పోలీసులు కారును వెంబడించి పట్టుకున్నారు. పరిశీలించగా 15 ఎర్రచందనం దుంగలు బయట పడ్డాయి. పట్టుబడిన నలుగురు తమిళనాడు వాసులుగా గుర్తించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని సిఐ సురేష్ కుమార్ తెలిపారు.

'సిట్యుయేషన్ రూమ్'కు ట్రంప్

వాషింగ్టన్, టెహరాన్, ఖతార్ : ఇరాన్ ప్రతీకార దాడులతో అమెరికా అప్రమత్తమైంది. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 'సిట్యుయేషన్ రూమ్'కు వెళ్లారు. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై ఆయన పరిశీలిస్తున్నారు. ఇరాన్‌లోని అణు కేంద్రాలపై అమెరికా దాడులకు ముందు కూడా ట్రంప్ సిట్యుషన్ రూమ్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే. దీంతో ఇప్పుడు ఆయన ఏ నిర్ణయం తీసుకుంటారో అని అంతా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. తమ అణుకేంద్రాలపై దాడులకు అమెరికాపై ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ సోమవారం సైతం హెచ్చరికలు జారీ చేసింది. యుద్ధం ప్రారంభించింది అమెరికా అయినప్పటికీ.. ముగింపు పలికేది తామేనని పేర్కొంది. త్వరలోనే పశ్చిమాసియాలోని తమ బలగాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ ప్రతీకార దాడులు చేపట్టే అవకాశం ఉందని అమెరికా అంచనా వేస్తోంది. టెహ్రాన్ ప్రతీకార దాడులు చేస్తే.. మరింత విరుచుకుపడతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు.

పశ్చిమాసియాలో 40 వేల మంది సైనికులను మోహరించిన అమెరికా 'కౌన్సిల్ ఆన్ ఫారిన్ రిలేషన్స్' నివేదిక ప్రకారం ఈ ఏడాది జూన్ నాటికి పశ్చిమాసియాలో దాదాపు 40 వేలమంది సైనికులను అమెరికా మోహరించింది. ఈజిప్టు, ఇరాక్, జోర్డాన్, ఖతార్, సిరియా, సౌదీ అరేబియా తదితర దేశాల్లోని దాదాపు 19 ప్రాంతాల్లో అమెరికా సైనిక స్థావరాలు ఉన్నట్లు సమాచారం. వీటిలో ఖతార్‌లోని అల్ ఉదీద్ ఎయిర్ బేస్ అతిపెద్దది. రాజధాని దోహాకు నైరుతి దిశలో దాదాపు 60 ఎకరాల్లో విస్తరించి వున్న ఈ స్థావరంలో దాదాపు 10 వేలమంది సైనికులు ఉన్నారు. ఇక్కడ యుఎస్ సెంట్రల్ కమాండ్ ఫార్వర్డ్ ప్రధాన కార్యాలయం ఉంది. స్థావరంలో యుఎస్ వైమానిక దళం యొక్క 379వ వైమానిక దండయాత్ర విభాగం, రాయల్ ఎయిర్ ఫోర్స్‌తో సహా ఇతర విదేశీ దళాలు కూడా ఉన్నాయి. ఈ స్థావరంలో రెండు వారాల నుంచి దాదాపు 40 మిలిటరీ విమానాలు అదృశ్యమైన శాటిలైట్ చిత్రాలు ఇటీవల బయటకు వచ్చాయి. ఇరాన్ దాడుల నుంచి రక్షించుకోవడం కోసమే అమెరికా వాటిని తరలించి ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇరాన్ దాడులను ఖతార్ ఖండించింది. ఇరాన్ దాడులతో ఖతార్ తన గగనతలాన్ని మూసివేయింది. ఇరాన్ దాడుల్లో ఎవరూ గాయపడలేదని తెలిపింది.

ఎయిర్ ఇండియా విమానాల దారిమళ్లింపు

ఇరాన్ దాడుల నేపథ్యంలో రెండు ఎయిర్ ఇండియా విమానాలను దారి మళ్లించారు. కువైట్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా 571 దాడుల నేపథ్యంలో ముంబయికి తిరిగివచ్చింది.

ఒడిశాలో అమానవీయ ఘటన..

- అరగుండు గీయించి.. మురికినీరు తాగించి..
- పశువులను అక్రమ రవాణా చేస్తున్నారంటూ దళితులపై దారుణం

గంజాం : ఒడిశాలో అత్యంత అమానవీయ ఘటన చోటుచేసుకుంది. ఆవులను, దూడలను అక్రమంగా తరలిస్తున్నారన్న ఆరోపణలతో ఇద్దరు దళితులపై దాడి చేసి, అరగుండు చేయించి, బలవంతంగా మురుగునీరు తాగించారు. ఈ అమానుష సంఘటన గంజాం జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంజాం జిల్లా ధారాకోట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆదివారం హరిపూర్ గ్రామంలో ఒక వ్యక్తి వద్ద నుంచి ఒక ఆవు, రెండు దూడలను కొనుగోలు చేసి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో ఖారిగుమ్మ అనే ప్రాంతానికి చేరుకోగానే, సుమారు ఏడెనిమిది మంది వారిని అడ్డగించారు. పశువులను అక్రమంగా తరలిస్తున్నారంటూ ఆరోపణలు చేశారు. బాధితుల వద్ద నుంచి బలవంతంగా డబ్బులు లాక్కోవడానికి ప్రయత్నించారు. బాధితులు ప్రతిఘటించడంతో నిందితులు వారిపై దాడి చేసి తీవ్రంగా కొట్టారు. అంతటితో ఆగకుండా ఆ దుండగులు బాధితులిద్దరికీ అరగుండు గీయించారు. బలవంతంగా వారిద్దరిచేత మురుగు కాలువలోని నీటిని తాగించారు. వీధుల్లో మోకాళ్లపై నడిపించి తీవ్రంగా అవమానించారు. వారి వద్ద నుంచి తప్పించుకున్న బాధితులిద్దరూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులను చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. ఈ అమానుష ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ధారాకోట పోలీస్ స్టేషన్ అధికారి చంద్రికా స్వయిన్ తెలిపారు.

ఎస్‌వి మ్యూజియం అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి- తిరుమల

తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర మ్యూజియం అభివృద్ధి పనులపై టిటిడి అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి సోమవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. చీఫ్ మ్యూజియం ఆఫీసర్ (ఇన్‌చార్జ్) సోమన్ నారాయణ ఆధ్వర్యంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అదనపు ఇఒకు మ్యూజియంలో ప్రస్తుత అభివృద్ధి పనుల పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా అదనపు ఇఒ మాట్లాడుతూ మ్యూజియాన్ని ప్రపంచ స్థాయి వస్తు ప్రదర్శనశాలగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. భద్రతాపరంగా తీసుకోవలసిన సమగ్ర చర్యలు, ఆధునిక సాంకేతికత ఆధారంగా సిసి కెమెరాలు, హెడ్ కౌంట్ సెన్సార్లు, గార్డులు, గైడులు ఏర్పాటు, మ్యూజియం ప్రాంగణంలో అభిప్రాయ సేకరణ కోసం ఫీడ్‌బ్యాక్ కియోస్క్‌నూ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మ్యూజియం తెరిచే సమయం, టికెట్ ధర, కళాఖండాల సంరక్షణ గది, అధికారిక సెల్ఫీ పాయింట్ తదితర అంశాలపైనా సమీక్ష నిర్వహించారు. నిర్మాణ దశలో ఉన్న అన్ని పనులను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షలో టిటిడి సిఇ సత్య నారాయణ, ట్రాన్స్‌పోర్ట్ జీఎం శేషారెడ్డి, ఈఈలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, మనోహర్, డిఇ ఎలక్ట్రికల్ చంద్రశేఖర్, విజిఒ సురేంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మధుసూదన్, మ్యూజియం క్యూరేటర్ శివకుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బెంగాల్‌లో విజృంభిస్తున్న

- విషపూరిత 'మోయ్నా మోడల్' చేపల పెంపకం

కొల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో మోయ్నా మోడల్ తరహాలో చేపల పెపంకం విజృంభిస్తోంది. దీంతో ప్రజారోగ్యంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మోయ్నా మోడల్ తరహాలో పెరిగే చేపల్లో పురుగుమందులు, విషపదార్థాల అవశేషాలు ఎక్కువగా ఉంటాయి. దీంతో ఈ కలుషితమైన, విషపూరితమైన చేపలు తినే మానవులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంది. మోయ్నా మోడల్‌లో ఒకే పొలంలోనే వరి చేలను - చేపలను పక్కపక్కనే పెంచుతారు. వరి చేలకు ఉపయోగించిన నీటినే చేపల పెంపకానికి ఉపయోగిస్తారు. దీంతో వరి చేలకు ఉపయోగించే క్రిమిసంహారక మందులు, ఇతర ఎరువులు కలిసి నీటిలోనే చేపలు పెరుగుతాయి. పశ్చిమ బెంగాల్‌లోని మేద్నీపూర్ జిల్లాలోని మోయ్నా ప్రాంతంలో 2017లో తొలిసారిగా ఈ విధంగా చేపలను పెంచారు. తరువాత ఇది రాష్ట్రమంతటా విస్తరించింది. ఈ విధానాన్ని మోయ్నా మోడల్ అని పిలుస్తున్నారు. సంప్రదాయ పద్ధతిలో చేపల్ని పెంచాలంటే చేపలకు ప్రత్యేకంగా చెరువులు ఉండాలి. ప్రత్యేక ఫీడ్ ఉండాలి. ఈ సంప్రదాయ పద్ధతికి ఎక్కువ వ్యయం అవుతుంది. అందువలన పశ్చిమ బెంగాల్‌లో ఎక్కువ మంది మోయ్నా మోడల్ వైపు మొగ్గుతున్నారు. ప్రారంభంలో చిన్నరైతులు ఈ విధానాన్ని అనుసరించినా ప్రస్తుతం భూస్వాములు, పెట్టుబడిదారులు కూడా ఈ విధానాన్నే అనుసరిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి చేపలు తక్కువ రేటుకే దిగుమతి అవుతున్నాయని, పోటీని తట్టుకోవాలంటే మోయ్నా మోడలే మార్గమని వ్యాపారవేత్తలు అంటున్నారు. చనిపోయిన కోళ్ల, బాతుల అవశేషాలను కూడా చేపలకు దానాగా వేస్తుండటంపై ఆందోళన వ్యక్తమవుతుంది. రాజధాని కొల్‌కతా వంటి పట్టణ ప్రాంతాల్లో అమ్ముడువుతున్న చేపల్లో 80 శాతం చేపలు ఈ విధానంలో పెంచినవే. ఈ చేపలు కోసిన వెంటనే దుర్వాసన వస్తోందని వినియోగదారులు చెబుతున్నారు. మోయ్నా మోడల్ చేపల పెంపకం రైతు వ్యతిరేక, శాస్త్రీయ వ్యతిరేకమని పర్యావరణవేత్తలు విమర్శిస్తున్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కేరళ మాజీ సిఎం అచ్యుతానందన్‌కు అస్వస్థత

- నిలకడగా ఆరోగ్య పరిస్థితి



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం సీనియర్ నేత, కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన సోమవారం తిరువనంతపురంలోని పట్టోంలో శ్రీ ఉత్రాడోం తిరునాల్ (ఎస్‌యుటి) ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన ఐసియులో ఉన్నారు. 2019లో స్ట్రోక్‌తో మంచం పట్టిన అచ్యుతానందన్ సోమవారం ఉదయం అస్వస్థతకు గురయ్యారు. దీంతో శ్వాస తీసుకోవడానికి తీవ్ర ఇబ్బంది పడ్డారు. వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించారు. ఆయన వయసు 101 సంవత్సరాలు. గతేడాది అక్టోబర్ 20న ఆయన 101లోకి అడుగుపెట్టారు. తిరువనంతపురంలోని బార్టన్‌హిల్‌లోని తన కుమారుడు విఎస్ అరుణ్ కుమార్ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు.

డమాస్కస్ చర్చిలో ఆత్మాహుతి దాడి : 20 మంది మృతి

డమాస్కస్ : డమాస్కస్‌లోని మార్ ఎలియాస్ క్రిస్టియన్ చర్చిలో ఆదివారం ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ దాడిలో 20 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. 52 మంది గాయాల పాలయ్యారని సిరియా ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఉగ్రవాద సంస్థ ఐఎస్ఐఎస్‌కు చెందిన ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడు. దీంతో చర్చికి ప్రార్థనల కోసం వచ్చిన వారిలో 20 మంది మరణించగా, డజన్ల సంఖ్యలో క్షతగాత్రులయ్యారు. ఈ ఘటనను సిరియా విదేశాంగ మంత్రిత్వశాఖ తీవ్రంగా ఖండించింది. మృతులకు సిరియా అంతర్గత మంత్రి అనాస్ ఖత్తాబ్ సంతాపం వ్యక్తం చేశారు. ప్రత్యేక బృందాలు ఈ ఘటనపై విచారణ చేపట్టినట్లు ఆయన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

ఆందోళనే తప్ప ఖండన ఏది ?



- 'ప్రస్తుత పరిస్థితి', 'తాజా ఉద్రిక్తతలు' అనే పదాలతో సరిపెట్టిన ప్రధాని మోడీ
- నాడు పహల్గాం దాడిని తీవ్రంగా ఖండించిన ఇరాన్

న్యూఢిల్లీ : ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా దాడులు జరిపిన కొన్ని గంటల తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఉద్రిక్తతలు పెరుగుతుండడంపై 'తీవ్ర ఆందోళన' వ్యక్తం చేశారు. చర్చలు, దౌత్యం ద్వారా ఉద్రిక్తతలను నివారించాలని హితవు పలికారు. అంతటితోనే మోడీ.. అమెరికా దాడులను ఖండించలేదు. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆయన ఒక పోస్ట్ పెడుతూ 'ప్రస్తుత పరిస్థితిపై ఇరాన్ నేతతో సవివరంగా చర్చించాను' అని తెలిపారు. మధ్యప్రాచ్యంలో శాంతి, సుస్థిరత తిరిగి నెలకొనాలన్న ఆకాంక్షను వ్యక్తపరిచారు. అమెరికా దాడులపై భారత ప్రభుత్వం అధికారికంగా స్పందించిన తీరు ఇది.

ముందు ఫోన్ చేసింది ఇరాన్ అధ్యక్షుడే

రెండు నెలల క్రితం పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన తర్వాత మోడీతో ఇరాన్ అధ్యక్షుడు ఫోన్‌లో మాట్లాడారు. ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించారు. ఇప్పుడు ముందుగా ఫోన్ చేసింది కూడా ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియానే. ఆయన భారత్‌తోపాటు ఈజిప్ట్, పాకిస్తాన్, ఫ్రాన్స్ సహా పలు దేశాల నేతలతో కూడా మాట్లాడి పరిస్థితులను వివరించారు. తాజా ఉద్రిక్తతలపై మోడీ ఆందోళన వ్యక్తం చేశారే తప్ప దాడులను ఖండించలేదు. అసలు ఆయన ఆ దాడులనే ప్రస్తావించలేదు. 'ప్రస్తుత పరిస్థితి', 'తాజా ఉద్రిక్తతలు' అనే పదాలను మాత్రమే తన సంభాషణలో ఉపయోగించారు. ఇరాన్‌లో నివసిస్తున్న భారతీయులను సురక్షితంగా స్వదేశానికి పంపుతున్నందుకు మోడీ కృతజ్ఞతలు తెలిపారని విదేశాంగ శాఖ వివరించింది. వాణిజ్య, శాస్త్ర సాంకేతిక రంగాలలోను, రెండు దేశాల ప్రజల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని ఇరువురు నేతలు నిర్ణయించుకున్నారని తెలిపింది.

చర్చలు జరుపుతుండగానే దాడులా?

టెహరాన్‌పై ఇజ్రాయిల్ దాడులు ప్రారంభించడానికి ముందు తమ అణు కార్యక్రమంపై యూరోపియన్ యూనియన్ దేశాలతో చర్చిస్తున్నామని ఇరాన్ స్పష్టం చేసింది. అమెరికా దాడులకు కొద్ది రోజుల ముందు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చీ యూరోపియన్ మంత్రులతో సమావేశం నిర్వహించారు. పెజెష్కియాన్ కూడా చర్చల గురించి మాట్లాడారని ఇరాన్ అధ్యక్ష కార్యాలయం తెలిపింది. దాడులు జరిగే సమయంలో సైతం అమెరికాతో పెజెష్కియాన్ చర్చలు జరుపుతూనే ఉన్నారు. ఇలా వివిధ రూపాల్లో చర్చలు, సంప్రదింపులు కొనసాగుతున్నప్పటికీ తొలుత ఇజ్రాయిల్, ఆ తర్వాత అమెరికా ఇరాన్‌పై దాడులకు పాల్పడ్డాయి. ఈ పరిస్థితుల్లో, చర్చలకు తాము కట్టుబడి ఉన్నామంటూ అమెరికా చేస్తున్న ప్రకటనల్లోని డొల్లతనం తేటతెల్లమవుతోంది.

ఇరాన్ అధ్యక్షుడు ఏమన్నారు?

'ఇవాళ ప్రపంచం చూస్తున్నది ఆందోళనకరమైన, ఆమోదయోగ్యం కాని ధోరణి. అంతర్జాతీయ నిబంధనలు, కర్తవ్యాల పరిధిలో పనిచేస్తున్న దేశాలపై... ముఖ్యంగా అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ పర్యవేక్షణలో కార్యకలాపాలు సాగిస్తున్న దేశంపై అమెరికా ప్రత్యక్షంగా, బహిరంగంగా దాడి చేసింది. ఈ చర్యలు చూస్తుంటే శాంతి, ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, అంతర్జాతీయ నిబంధనలకు కట్టుబడి ఉన్నామంటూ అమెరికా చేస్తున్న వాదనలన్నీ కేవలం నినాదాలేనని (ప్రజాభిప్రాయాన్ని) వంచించడం తప్ప మరేమీ కాదని తేలిపోయింది' అని పెజెష్కియాన్‌ను ఉటంకిస్తూ ఇరాన్ అధ్యక్ష కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

అతి అతి పెద్ద, చారిత్రక అబద్ధం

ఇరాన్‌పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులకు అమెరికాతో పాటు కొన్ని యూరోపియన్ యూనియన్ దేశాలు కూడా మద్దతు ఇవ్వడాన్ని పెజెష్కియాన్ విమర్శించారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉన్నాయంటూ అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న ఆరోపణలను 'అతి పెద్ద, చారిత్రక అబద్ధం'గా తోసిపుచ్చారు. 'సుప్రీం లీడర్ జారీ చేసిన ఫత్వా ప్రకారం అణ్వాయుధాల తయారీ, వినియోగం మతపరంగా, నైతికంగా నిషిద్ధం. ఇరాన్ రక్షణ సిద్ధాంతంలో వాటికి చోటు లేదు. అంతర్జాతీయ వేదికపై ఇరాన్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారం పూర్తి అబద్ధం. తన చట్టబద్ధమైన హక్కులను వినియోగించుకోకుండా నిరోధించే ప్రయత్నాలను ఇరాన్ ఎప్పటికీ అంగీకరించదు. తమ దేశ ప్రాదేశిక సమగ్రతను కాపాడటానికి ఇరాన్‌కు పూర్తి హక్కు ఉంది' అని పెజెష్కియాన్ స్పష్టం చేశారని అధ్యక్ష కార్యాలయం వివరించింది.

స్వదేశానికి భారతీయులు

ఈ నెల 13న ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులు ప్రారంభించడానికి ముందు అక్కడ పదివేల మందికి పైగా భారతీయులు నివసిస్తున్నారు. వీరిలో విద్యార్థులు, వృత్తి నిపుణులు, వ్యాపారులు ఉన్నారు. ఆపరేషన్ సింధు కింద ఇప్పటి వరకూ 1,428 మంది భారతీయులు స్వదేశానికి చేరుకున్నారు. గగనతలాన్ని చాలా వరకు మూసివేయడంతో ఇరాన్‌లోని మషాహద్ నగరం నుండి ప్రత్యేక విమానాలు నడుపుతున్నారు. కొందరు భారతీయులు ముందుగా అర్మేనియా, తుర్క్‌మెనిస్థాన్ చేరుకొని అక్కడి నుండి వాణిజ్య విమానాలలో ఢిల్లీకి వస్తున్నారు.

పెల్లుబికిన ప్రజాగ్రహం !

- ఇరాన్‌పై అమెరికా దాడులను వ్యతిరేకిస్తూ ప్రపంచవ్యాప్తంగా నిరసనలు
- 'యుద్ధం వద్దు, శాంతి ముద్దు' అంటూ నినాదాలు
- ట్రంప్ ఫొటోను కాళ్లతో తొక్కిన పాకిస్తానీయులు



'ప్రజల కోసం డబ్బు ఖర్చు చేయండి.. యుద్ధాల కోసం కాదు..' అంటూ వైట్ హౌస్ ఎదుట ఆందోళన చేస్తున్న అమెరికా వాసులు

వాషింగ్టన్ : ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా జరిపిన బాంబు దాడుల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా తీవ్ర నిరసనలు చోటుచేసుకున్నాయి. అమెరికాతో పాటు పలు దేశాల్లోని ప్రజలు ఆందోళనలు చేపట్టారు. ట్రంప్ వైఖరిని వారు తీవ్రంగా ఖండించారు. ఇది నేరమని వారు నినాదాలు చేశారు. తక్షణమే శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. ట్రంప్‌కి నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలంటూ కొద్ది రోజుల క్రితమే పాకిస్తాన్ ప్రతిపాదించింది. తాజా పరిణామాల నేపథ్యంలో కరాచిలో వేలాదిమంది ప్రదర్శకులు ట్రంప్ ఫొటోను కాళ్లతో తొక్కుతూ ఆందోళనలు చేయడం గమనార్హం.

అమెరికాలో నిరసనలు

ట్రంప్ వివాదాస్పద ఇమ్మిగ్రేషన్ విధానాలను వ్యతిరేకిస్తూ అమెరికా అంతటా నిరసనలు చెలరేగిన విషయం తెలిసిందే. తాజాగా ఇరాన్ అణు కేంద్రాలపై బాంబు దాడులకు వ్యతిరేకంగా శాన్‌ఫ్రాన్సిస్కో, వాషింగ్టన్ డిసి, న్యూయార్క్, బోస్టన్‌లలో ప్రజలు రోడ్లపైకి వచ్చారు. యుద్ధం కోసం కాదు, ప్రజల అవసరాల కోసం ఖర్చుచేయండి అంటూ నినాదాలు చేశారు. అమెరికా బంకర్ బ్లస్టర్ బాంబులను వినియోగించడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. న్యూయార్క్, బోస్టన్‌లో పార్టీ ఫర్ సోషలిజం అండ్ లిబరేషన్ సంస్థల ఆధ్వర్యంలో నిరసనలు జరిగాయి. "ఇరాన్ పై యుద్ధం ఆపండి" అన్న డిమాండ్‌తో తమ ఆందోళనలు కొనసాగుతాయని ఆన్సర్ కొయిలేషన్ సంస్థ ప్రకటించింది.

పలు దేశాల్లో ఆందోళనలు

అమెరికాతో పాటు యూరప్, ఆసియా, ఆఫ్రికా వ్యాప్తంగా ఈ దాడులను వ్యతిరేకిస్తూ ఆందోళనలు పెద్ద ఎత్తున జరిగాయి. లండన్, బ్రసెల్స్, ది హేగ్ నగరాల్లో వేలాది మంది గాజాలో హింసను ఆపాలని, అమెరికా, ఇజ్రాయిల్ విధానాలను వ్యతిరేకిస్తూ ర్యాలీలు నిర్వహించారు. ఆసియాలోని జపాన్, ఇరాన్‌లతో పాటు మొరాకో, దక్షిణాఫ్రికా, సొమాలియా, పోర్చుగల్‌లో యుద్ధ వ్యతిరేక ర్యాలీలు జరిగాయి. మరోవైపు రష్యా అధ్యక్షుడు పుతిన్ అమెరికా దాడులను ఖండించారు. ఇరాన్ ప్రజలకు సహాయమందిస్తామని ప్రకటించారు.

నాన్-ఇమ్మిగ్రెంట్ వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాల పరిశీలన

న్యూఢిల్లీ : నాన్-ఇమ్మిగ్రెంట్ వీసా కోసం దరఖాస్తు చేసుకునేవారి వ్యక్తిగత సోషల్ మీడియా ఖాతాలను అమెరికా ప్రభుత్వం పరిశీలించనుంది. ఈ విషయాన్ని భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం సోమవారం ప్రకటించింది. అమెరికా జాతీయ భద్రతా రీత్యా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. దరఖాస్తుదారుల గుర్తింపు, వారికి అమెరికా ప్రవేశాన్ని నిర్ధారించడానికి అవసరమైన పరీక్షలను సులభతరం చేయడానికి దరఖాస్తుదారులు తమ సోషల్ మీడియా ఖాతాలల్లోని గోప్యతా సెట్టింగ్‌లను తగిన విధంగా మార్చాలని కూడా సూచించింది.

దరఖాస్తుదారులు తమ ఫారమ్‌లపై సోషల్ మీడియా ఖాతాలను తప్పనిసరిగా పేర్కొనాలని తెలిపింది. నాన్-ఇమ్మిగ్రెంట్ వీసా దరఖాస్తులను త్వరలో షెడ్యూలింగ్ చేయడం ప్రారంభిస్తామని, ఈ నెల 18న అమెరికా హోం మంత్రిత్వ శాఖ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనికి కొన్ని రోజుల వ్యవధిలోనే అమెరికా రాయబార కార్యాలయం ఈ ప్రకటన విడుదల చేయడం విశేషం. అమెరికా విదేశాంగ శాఖ కూడా ఇటీవల ఇలాంటి ప్రకటనే విడుదల చేసింది. అమెరికాలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే వారంతా అమెరికన్లకు, అమెరికా జాతీయ ప్రయోజనాలకు హాని కలిగించే ఉద్దేశం లేకుండా ఉండాలని, వీసా జారీ ప్రక్రియలో అమెరికా అప్రమత్తంగా ఉండాలని తెలిపింది.

ఇ-స్టాంపులు ట్యాంపర్

(మొదటి పేజీ తరువాయి)

అన్ని కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేపడుతున్నది యర్రప్పే కావడం గమనార్హం. ఇటీవల జరిగిన ఆయన కుమార్తె వివాహం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌తోనూ కలిసి దిగిన ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇంత పెద్ద ఎత్తున ప్రభుత్వానికి చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకుండా జరుగుతున్న ఈ వ్యవహారంపై ఎస్ఆర్ ఇన్‌ఫ్రాకు తెలియకుండా మూడు సంవత్సరాలుగా నడుస్తుందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే ఇటువంటి భాగోతాలు ఇంకెన్ని పనుల విషయంలో జరుగుతున్నాయోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

రూ.26 వేలు ఇవ్వాలన్నారు. రూ.12 వేలలోపు ఆదాయం ఉన్న వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, తల్లికి వందనం అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం హామీనిచ్చిందన్నారు. ఈ కార్యక్రమానికి డివైఎఫ్ఐ నాయకులు నాగేశ్వరరావు, పలువురు సిఐటియు నాయకులు సంఘీభావం తెలిపారు. ధర్నా అనంతరం సుబ్బరావమ్మ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం విజయవాడ ఆటోనగర్‌లోని గ్రామ, వార్డు సచివాలయ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో కలెక్టరేట్ వద్దకు వెళ్లకుండా పోలీసులను మొహరించి అడ్డుకునే ప్రయత్నం చేశారు. ప్రశ్నించిన అంగన్‌వాడీలు, నేతలతో పోలీసులు వాగ్వివాదానికి దిగారు. పోలీసుల ఆంక్షలు, అడ్డంకులను అధిగమించి, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్దసంఖ్యలో భీమవరం కలెక్టరేట్ వద్దకు తరలొచ్చారు. ముందస్తుగా వేసిన టెంట్ సరిపోకపోవడంతో మరో టెంట్ ఏర్పాటు చేస్తున్న నేతలను పోలీసులు అడ్డుకున్నారు. అసలు ధర్నాకు అనుమతి లేదని, టెంట్ ఎలా ఏర్పాటు చేస్తారని పోలీసులు నేతలతో వాగ్వివాదానికి దిగారు. ఈ నేపథ్యంలో సిఐ అక్కడకు చేరుకుని సిఐటియు నేతలతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి హామీ ఇచ్చారు. కాకినాడ జిల్లా కేంద్రంలోని డిఎంహెచ్ఓ కార్యాలయాన్ని అంగన్‌వాడీలు ముట్టడించారు. అనంతరం డిఎంహెచ్ఓ డాక్టర్ నరసింహనాయక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అల్లూరి జిల్లా పాడేరు కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. సమస్యలపై డిఆర్ఓకు వినతిపత్రం అందజేశారు.



చిన్నారి

జీవన సౌరభం

దారిలో అడ్డు వస్తే ఆపాల్సింది ప్రయాణం కాదు, నడిచే పద్ధతి. చేసే పనిలో అడ్డంకులు వస్తే ఆపాల్సింది పని కాదు, ప్రయత్నించే విధానం.

మీకోసం

నెయ్యి త్వరగా పేరుకుపోకుండా ఉండాలంటే మీగడ కట్టేటప్పుడు కొద్దిగా నీళ్లు చల్లాలి.



JEEVANA జీవన the family

అనగనగా ఒక పిల్లి



అనగనగా ఒక ఇల్లుంది
ఇంటిలోన ఒక పిల్లుంది
మ్యావ్ మ్యావ్ మని అంటుంది
పాలు, పెరుగు తింటుంది.

పిల్లికి ఆకలి వేసింది
పాల గిన్నెకై వెతికింది
వాసన చూస్తూ నడిచింది
ఇల్లంతా తెగ తిరిగింది.

గోడలోన ఒక గూడుంది
గూటిలోన ఒక గిన్నుంది.
గిన్నె నిండా పెరుగుంది
పిల్లికి నోరు ఊరింది.

చప్పుడు చేయక నడిచింది
ఒక్కో.. అడుగు వేసింది
గిన్నెలో మూతిని పెట్టింది.
కళ్ళను మెల్లిగా మూసింది



పిల్లిని అమ్మ చూసింది
అట్ల కర్రను విసిరింది
పిల్లికి తృటిలో తప్పింది
పరుగున పారిపోయింది!

- పేట యుగంధర్,
వెదురుకుప్పం,
94925 71731.

సరిచేసి రాయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని తెలుగు పదాలు ఇచ్చాం. వాటిలో కొన్ని అక్షరాలు తప్పుగా ఉన్నాయి. అవేంటో కనిపెట్టి సరైన పదం మీరు రాయండి.



వర్నన -
పోషన -
విస్థీర్నం -
నిపునుడు -
సంగర్షన -
వర్నాంతరం -
సాదారనమైన -
బ్రహ్మనుడు -

నేను గీసిన బొమ్మ



- వి.రాహుల్,
10వ తరగతి,
తెలంగాణ ఆదర్శ పాఠశాల,
లింగాల ఘనపురం మండలం,
జనగామ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మజ్జిగ ఆరోగ్యానికి మేలు



మజ్జిగ ఆరోగ్యకరమైన పానీయం. ఇది జీర్ణక్రియకు ఎంతగానో సహాయపడుతుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఎముకలను బలంగా ఉంచుతుంది. అలాగే బరువు తగ్గడానికి, రక్తపోటును తగ్గించడానికి, చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి కూడా మేలు చేస్తుంది.

జీర్ణక్రియ : మజ్జిగలో లాక్టిక్ ఆమ్లం ఉంటుంది, ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. అసిడిటీ, గ్యాస్ సమస్యలను తగ్గిస్తుంది.

రోగనిరోధక శక్తి : మజ్జిగలో ప్రోబయోటిక్స్ ఉంటాయి, ఇవి రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి.

ఎముకల ఆరోగ్యం : మజ్జిగలో కాల్షియం, ఫాస్ఫరస్, విటమిన్ డి ఉంటాయి. ఇవి ఎముకలను బలంగా ఉంచడంలో మేలు చేస్తాయి.

బరువు తగ్గడం : మజ్జిగలో కేలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది.

రక్తపోటు : మజ్జిగలో ఉండే పొటాషియం రక్తపోటును తగ్గించడంలో తోడ్పడుతుంది.

చర్మానికి : మజ్జిగలో ఉండే లాక్టిక్ ఆమ్లం చర్మం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది, చర్మాన్ని మృదువుగా, కాంతివంతంగా చేస్తుంది.

శరీరానికి శక్తినిస్తుంది : మజ్జిగలో విటమిన్లు ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని అందిస్తాయి.

ఇతర ప్రయోజనాలు..

- మజ్జిగలో విటమిన్ బి12, విటమిన్ కె, ఇతర పోషకాలు కూడా ఉంటాయి.
- మజ్జిగ రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది.
- ఊపిరితిత్తులు, గుండె, మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుతుంది.
- మజ్జిగ తీసుకోవడం వల్ల కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం లభిస్తుంది.
- మజ్జిగ జీర్ణ సమస్యలు, మలబద్ధకం నుండి ఉపశమనం ఇస్తుంది. – మజ్జిగలో ఇంగువ కలుపుకుని తాగితే జీర్ణక్రియకు అద్భుతంగా ఉపయోగపడుతుందని తాజాగా నిపుణులు చెబుతున్నారు.
- మజ్జిగలో కొద్దిగా ఇంగువ కలుపుకుని తాగితే గ్యాస్, ఉబ్బరం, ఎసిడిటీ సమస్యలు తగ్గుతాయి.
- పరగడుపున మజ్జిగ తాగితే చాలా మంచిది. జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుందని నిపుణులు చెబుతున్నారు.

తల నూనె ఇలా రాసుకోవాలి



జుట్టుకు తరచూ నూనె రాసుకోవడం వల్ల వెంట్రుకలకు కావాల్సిన పోషణ అందుతుంది. అయితే కొందరు నూనె పెట్టుకోవడంలో కొన్ని పొరపాట్లు చేస్తుంటారు. దాంతో జుట్టు ఆరోగ్యం మెరుగుపడక పోగా చుండ్రు, దురదతోపాటు ఇతర ఇన్ఫెక్షన్లకు దారితీస్తుంది. ఈ క్రమంలో జుట్టుకు నూనె ఎలా పెట్టుకోవాలో నిపుణులు కొన్ని సూచనలు చేస్తున్నారు.

ఈ రోజుల్లో కెమికల్ లేని హెయిర్ ఆయిల్ లభించడం లేదు. అలాగే నానాటికీ పెరుగుతున్న కాలుష్యం మధ్య జుట్టుకు ఎక్కువ నూనెను రాయడం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ.

జుట్టు బలహీనంగా మారుతుంది :
తలకు ఎక్కువగా నూనె రాయడం వల్ల.. స్కాల్ప్ విపరీతంగా జిడ్డుగా మారుతుంది. దీంతో వెంట్రుకలు జిగటగా, బరువైనట్లు అనిపిస్తుంది. అంతేకాకుండా జుట్టు బలహీనంగా మారిపోతుంది.

రంధ్రాలు మూసుకుపోతాయి :
జుట్టుపై అధికంగా నూనె రాయడం వల్ల స్కాల్ప్ రంధ్రాలు మూసుకుపోతాయి. ఇది జుట్టు పెరుగుదలను అడ్డుకుంటుంది. చుండ్రు సమస్య కూడా ఏర్పడుతుంది.

జుట్టులో మురికి పేరుకుపోతుంది :
ఎక్కువ నూనెను అప్లై చేయడం వల్ల దుమ్ము, ధూళి జుట్టుకు త్వరగా అంటుకుంటుంది. దీని వల్ల జుట్టులో ఇన్ఫెక్షన్, దురద వస్తుంది.

జుట్టు రాలడం :
అధిక నూనెను రాయడం వల్ల జుట్టు మూలాల బరువు పెరుగుతుంది. దీని కారణంగా జుట్టు బలహీనంగా మారుతుంది. దీంతో జుట్టు రాలడం మొదలవుతుంది.

ఫంగల్ ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం :
అధిక నూనె, మురికి కలిపి తలపై ఫంగల్ ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని పెంచుతుంది. ఇది జుట్టు, శిరోజాల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది.

నూనె ఎలా రాసుకోవాలంటే..
నూనె పెట్టుకునేటప్పుడు, కుదుళ్లకు పట్టేలా మసాజ్ చేయాలి. మసాజ్ చేయడం వల్ల జుట్టుకు రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. వెంట్రుకలు ఆరోగ్యంగా పెరిగేలా చేస్తుంది. ఈ మసాజ్ 5 నుంచి 10 నిమిషాల పాటు సున్నితంగా చేసుకోవాలి.

తలకి నూనె పెట్టుకోవడానికి ముందు దాన్ని గోరువెచ్చగా వేడిచేయాలి. అప్పుడే నూనె మాడులోకి ఇంకుతుంది. పోషకాలన్నీ కుదుళ్ల వరకూ వెళ్తాయి.

ఇక నూనె పెట్టగానే తల దువ్వుకోకూడదు. నూనె పెట్టడం వల్ల వెంట్రుకల మొదళ్లు బలహీనపడతాయి. అలాంటి సమయంలో దువ్వడం, చిక్కులు తీయడం చేస్తే జుట్టు రాలిపోతుంది. దువ్వెనకు బదులుగా చేతి వేళ్లతోనే మెల్లగా చిక్కులు తీసుకోవాలి. జడను కూడా మరీ బిగుతుగా కాకుండా వదులుగా వేసుకోవాలి.

నూనె పెట్టుకున్న వెంటనే షాంపూతో తలస్నానం చేయకూడదు. అలాగని రాత్రంతా అలాగే వదిలేయకూడదు. కనీసం గంట నుంచి రెండున్నర గంటల వరకు తలకి నూనె ఉంచుకోవాలి. అప్పుడే పోషకాలన్నీ కురులకు అందుతాయి. లేకపోతే తలలో దుమ్ము, సూక్ష్మజీవులు చేరే అవకాశం ఉంటుంది. చుండ్రు రావడానికి, వెంట్రుకలు రాలడానికి కూడా దారితీస్తుంది.

చుండ్రు సమస్య ఉంటే మాత్రం నూనెకు దూరంగా ఉండాలి. అలాంటి సమస్య ఉన్నవారు మాడుకూ, జుట్టుకు తేమను అందించే హెయిర్ మాస్కులు వేసుకోవాలి.

పిండి రుబ్బును ఫ్రిజ్‌లో పెడుతున్నారా!



చాలామంది వారానికి సరిపడా ఇడ్లీ, దోశ పిండిని ఒకేసారి రుబ్బుకుంటారు. ఫ్రిజ్‌లో నిల్వ చేస్తుంటారు. అయితే.. రుబ్బిన పిండిని ఇలా ఫ్రిజ్‌లో రోజుల తరబడి పెట్టుకోవడం ఆరోగ్యానికి ఏమాత్రం మంచిదికాదని నిపుణులు చెబుతున్నారు.

- ఫ్రిజ్‌లో ఉంచినప్పటికీ.. రుబ్బిన పిండిపై బ్యాక్టీరియా, ఫంగస్ లాంటివి సులభంగా పెరుగుతాయి. దాంతో చేసిన ఆహార పదార్థాలు అనారోగ్యాన్ని కలిగిస్తాయి.
- నీటిలో నానబెట్టిన కొన్ని రకాల పప్పు దినుసులు ఇట్టే పులిసిపోతాయి. వాటిపై ఈస్ట్ పెరుగుతుంది. అలాంటివాటిని రెండుమూడు రోజులపాటు అలాగే ఉంచేస్తే.. ఈస్ట్ మరింత పెరిగిపోతుంది. దీన్ని కొద్ది మొత్తంలో తీసుకుంటే ఫర్వాలేదు కానీ, మోతాదుకు మించితే శరీరంలో అలర్జీలకు కారణం అవుతుంది.
- ఎక్కువగా పులిసిన పిండి.. జీర్ణ వ్యవస్థపై చెడు ప్రభావం చూపుతుంది. జీవక్రియ రేటును ప్రభావితం చేస్తుంది.

పేగుల్లో ఉండే మంచి బ్యాక్టీరియాకు హాని కలిగిస్తుంది. పేగుల ఇన్ఫెక్షన్ కలిగిస్తుంది. ఆ పిండితో చేసిన ఆహార పదార్థాలను తింటే కడుపులో గ్యాస్, విరేచనాలు ఇతర జీర్ణ సమస్యలు చుట్టుముడతాయి.

తేమ పెరిగి ఫంగస్ ఏర్పడుతుంది : ఫ్రిజ్‌లో ఉంచిన పిండిలో తేమ చొరబడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇది మాయిశ్చర్‌తో కలసి పిండిని పాడుచేస్తుంది.

పోషక విలువలు తగ్గుతాయి : ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన పిండిలోని జీవకణాలు నిర్జీవంగా మారి పోషణలోనూ తగ్గుదల ఏర్పడుతుంది.

రుచి, వాసన మారతాయి : పిండిని ఫ్రిజ్‌లో ఉంచిన తర్వాత వండిన వంటకాలకు మామూలు రుచి ఉండదు. సహజమైన వాసన పోతుంది.

బాక్టీరియా పెరగొచ్చు : గాలిమార్పు, తేమ వల్ల కొన్ని ప్రమాదకరమైన సూక్ష్మజీవులు వృద్ధి చెందే ప్రమాదం ఉంది.

'అంచనాలను అందుకోలేకపోయాం..'



"థగ్ లైఫ్' చిత్రం ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోయిం'దన్నారు మణిరత్నం. ఈ విషయంలో ఆడియన్స్‌కు క్షమాపణలు చెప్పారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన 'థగ్ లైఫ్' ఫలితంపై స్పందించారు. 'మా ఇద్దరి నుంచి మరో 'నాయకుడు'ను ఆశించిన వారికి నేను చెప్పగలిగేది ఒక్కటే. మమ్మల్ని క్షమించండి. ఆ సినిమా కంటే తక్కువ దాన్ని చేయడం మా ఉద్దేశం కాదు. అలాంటి ఆలోచన మాకెప్పుడూ లేదు. అలా ఎలా చేయాలనుకుంటాం! మేం పూర్తిగా భిన్నమైనదాన్ని అందించాలనుకున్నాం. ఎక్కువ అంచనా వేయడంతో అనుకోని ఫలితాన్ని అందుకున్నాం. మేము అందించిన దానికంటే ఆడియన్స్ భిన్నంగా కోరుకున్నారని అర్థం చేసుకున్నా' అని అన్నారు. దాదాపు 37 ఏళ్ల తర్వాత కమల్‌హాసన్, మణిరత్నం కాంబోలో తెరకెక్కిన చిత్రమే 'థగ్ లైఫ్'. దీంతో ఈ సినిమాపై ప్రేక్షకులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. జూన్ 5న విడుదలైన ఈ సినిమా వాటిని అందుకోవడంలో విఫలమైంది.

రెండు విభిన్న పాత్రల్లో ...



సూర్య, వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'సూర్య 46' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై నిర్మితమ వుతున్న ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతోంది. ఇటీవల హైదరాబాద్‌లో ఈ సినిమాని ప్రారంభించారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో సూర్య పాత్ర రెండు కోణాలతో ఉంటుందని తెలుస్తోంది. ఒకవైపు పాజిటివ్ యాంగిల్ చూపించగా.. మరోవైపు నెగిటివ్ షేడ్స్ కనిపించనున్నాయని వార్తలు వస్తున్నాయి. ప్రత్యేకమైన లుక్‌తో వెంకీ అట్లూరి సూర్యను డిజైన్ చేస్తున్నారని తెలుస్తోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మమిత బైజు నటిస్తున్నారు. సీనియర్ నటి రవీనా టాండన్, రాధిక శరత్ కుమార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారని సమాచారం. 2025 చివరిలో ఈ సినిమాను విడుదల చేయాలని నిర్మాత సూర్యదేవర నాగవంశీ ప్లాన్ చేస్తున్నారు.

పేరు నచ్చలేదు.. సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వం..



కేంద్రమంత్రి, నటుడు సురేశ్ గోపి, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ'. దీనికి సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ నిరాకరించడం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. జానకి అనే మహిళ చేసే న్యాయపోరాటం చుట్టూ తిరిగే కథగా దీన్ని ప్రవీణ్ నారాయణ్ తెరకెక్కించారు. సీతాదేవికి మరో పేరైన జానకిని అలాంటి పాత్రకు పెట్టటం సరైంది కాదంటూ చిత్రం స్క్రీనింగ్‌కు అనుమతి నిరాకరించినట్లు సినీ వర్గాలు తెలిపాయి. ఈ సినిమా ప్రదర్శనకు సెన్సార్ బోర్డు అనుమతి నిరాకరించిందని దర్శకుడు కూడా వెల్లడించారు. ఇక ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ కేరళ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ దర్శకుడు ఉన్ని కృష్ణన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 'సినిమాలో జానకి అనే పేరును ఉపయోగించరాదని సెన్సార్ బోర్డు ఈ చిత్ర నిర్మాతలకు స్పష్టంగా తెలియజేసిన'ట్లు చెప్పారు. టైటిల్, పాత్ర పేరును మార్చాలని బోర్డు చిత్రబృందానికి సూచించినట్లు తెలిపారు. 'దాడికి గురైన మహిళ పాత్రకు సీతాదేవి పేరును పెట్టలేమ'ని బోర్డు చెప్పిందన్నారు. ఇటీవల మరో మలయాళ చిత్ర నిర్మాత తన సినిమాలో జానకి అనే పాత్ర పేరు విషయంలో ఇలాంటి సమస్యనే ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. ఆ సినిమా వారు సెన్సార్ సర్టిఫికెట్ పొందడానికి పాత్ర పేరును 'జయంతి'గా మార్చారని తెలిపారు. థ్రిల్లర్ కథాంశంతో ఈ 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' రూపొందింది. సత్యం ఎప్పటికైనా విజయం సాధిస్తుందనేది ఉప శీర్షిక. ఇందులో జానకిగా అనుపమ కనిపించనున్నారు. లాయర్‌గా సురేశ్ గోపి నటించారు.

రావి రామ్‌చరణ్ అరంగ్రేటం



విజయవాడ కుర్రాడు రావి రామ్‌చరణ్ టాలీవుడ్‌లోకి అరంగ్రేటం చేశాడు. వారాహి ఆర్ట్స్ అండ్ శక్తి క్రియేషన్స్ బ్యానర్‌పై 'కాకర్ల ఎంఆర్' కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో 'వెస్టన్ లవ్' తెరకెక్కుతోంది. ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ సాంస్కృతిక విభాగం కన్వీనర్, జనసేన రాష్ట్ర నాయకురాలు రావి సౌజన్య కుమారుడే రామ్‌చరణ్. అతడికి జోడీగా కథానాయికగా మహి నటిస్తున్నారు. బెంగళూరులో బీటెక్ పూర్తిచేసిన రామ్‌చరణ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నారు. రావి సౌజన్య, కాకర్ల ఎంఆర్ నిర్మాతలు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ విజయవాడ పరిసర ప్రాంతాల్లో కొనసాగుతోంది.

రసపట్టులో తొలిటెస్ట్

- రాహుల్, పంత్ సెంచరీలు
- టీమిండియా రెండో ఇన్నింగ్స్ 364ఆలౌట్
- ఇంగ్లండ్ లక్ష్యం 370పరుగులు

లీడ్స్: భారత్–ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతున్న తొలిటెస్ట్ రసపట్టుగా సాగుతోంది. రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియా 364పరుగులకు ఆలౌట్ కావడంతో ఇంగ్లండ్ ముందు 370 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. చివరి రోజు ఫలితం రానుండగా.. ఇరుజట్లకు విజయావకాశాలు మెండుగానే ఉన్నాయి. సోమవారం రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియా వికెట్ కీపర్ రిషబ్(118), కెఎల్ రాహుల్(137) సెంచరీలతో కదం తొక్కారు. దీంతో 96ఓవర్లలో 364 పరుగుల వద్ద భారత్ ఆలౌటైంది. టీ విరామ సమయానికి భారతజట్టు 75 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 298 పరుగులు పటిష్టంగా ఉన్నా.. ఆ తర్వాత సెంచరీలు కొట్టిన పంత్, కెఎల్ రాహుల్‌తోపాటు కరణ్ నాయర్(20) నిరాశపరిచారు. సిరాజ్, బుమ్రా కూడా డకౌటవ్వడంతో భారతజట్టు 349 పరుగుల వద్ద వరుసగా మూడు వికెట్లు కోల్పోయింది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోర్ 2వికెట్ల నష్టానికి 90పరుగులతో నాల్గోరోజు ఆటను కొన సాగించిన భారత్‌తో ఆరంభంలోనే గట్టి ఎదురు దెబ్బ తగిలింది. తొలి ఇన్నింగ్స్ హీరో, కెప్టెన్ శుభ్‌మన్ గిల్(8) వికెట్ కోల్పోయింది. తొలి సెషన్ తొలి ఓవర్‌లోనే కీలకమైన కెప్టెన్ శుభమన్ గిల్ వికెట్‌ను టీమిండియా చేజార్చుకుంది. మరో రెండు పరుగులు జోడించిన గిల్.. కార్సే బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత కెఎల్ రాహుల్, పంత్ కలిసి 4వ వికెట్‌కు



195పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి భారత్‌కు భారీ ఆధిక్యతను సమకూర్చారు. అర్ధసెంచరీ పూర్తయ్యాక రిషబ్ పంత్ సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడ్డాడు. వన్డే తరహాలో బ్యాటింగ్ చేశాడు. పంత్(118; 140 బంతుల్లో 15ఫోర్లు, 3సిక్సర్లు) ధాటిగా ఆడే క్రమంలో బషీర్ బౌలింగ్‌లో క్రాలేకు క్యాచ్ ఇచ్చి పెవీలియన్‌కు చేరాడు. దీంతో భారత్ 287పరుగుల వద్ద 4వ వికెట్ కోల్పోయింది. పంత్ ఔటయ్యాక కెఎల్ రాహుల్ కూడా సెంచరీతో కదం తొక్కాడు. ఇంగ్లండ్ బౌలర్లు కర్సే, టంగ్‌కు మూడేసి, బషీర్‌కు రెండు, వోక్స్, స్టోక్స్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

జైస్వాల్, గిల్ సింగిల్ డిజిట్‌కే...

తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీలతో కదం తొక్కిన యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్ రెండో ఇన్నింగ్స్‌లో సింగిల్ డిజిట్‌కే ఔటయ్యారు. జైస్వాల్(101), గిల్(147) సెంచరీలతో కదం తొక్కి టీమిండియా భారీస్కోర్ చేసేందుకు దోహదపడ్డారు. కానీ రెండో ఇన్నింగ్స్‌లో జైస్వాల్(4), గిల్(8) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. కానీ తొలి ఇన్నింగ్స్‌లో 134పరుగులతో రాణించిన రిషబ్ పంత్ రెండో ఇన్నింగ్స్‌లోనే సెంచరీతో రాణించడం విశేషం.

స్కోర్‌బోర్డు...

భారత్ తొలి ఇన్నింగ్స్ : 471పరుగులు
ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ : 465పరుగులు

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)స్మిత్ (బి)కర్సే 4, కెఎల్ రాహుల్ (బి)కర్సే 137, సాయి సుదర్శన్ (సి)క్రాలే (బి)స్టోక్స్ 30, శుభ్‌మన్ (బి)కర్సే 8, రిషబ్ పంత్ (సి)కర్సే (బి)బషీర్ 118, కరణ్ నాయర్(సి అండ్ బి)వోక్స్ 20, జడేజా (నాటౌట్) 25, శార్దూల్ (సి)రూట్ (బి)టంగ్) 4, సిరాజ్ (సి)స్మిత్ (బి)టంగ్ 0, ప్రసిధ్ (సి)టంగ్ (బి)బషీర్ 0, అదనం 18. (96ఓవర్లలో) 364 పరుగులకు ఆలౌట్. **వికెట్ల పతనం:** 1/16, 2/82, 3/92, 4/287, 5/333, 6/335, 7/349, 8/349, 9/349, 10/354 **బౌలింగ్:** వోక్స్ 19–4–45–1, కర్సే 19–2–80–3, టంగ్ 18–2–72–3, బషీర్ 22–1–90–2, స్టోక్స్ 15–2–47–1, రూట్ 3–0–21–0.

ముంబయికి పృథ్వీ షా టాటా

- ఎన్ఓసి కోసం దరఖాస్తు



ముంబయి: టీమిండియా ఓపెనర్, ముంబయి ఆటగాడు పృథ్వీ షా కీలక నిర్ణయం తీసుకున్నాడు. దేశవాళీ క్రికెట్‌లో ఇకపై ముంబయికి ఆడకూడదని నిర్ణయించుకున్నాడు. దీంతో 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్' కోసం ముంబయి క్రికెట్ అసోసియేషన్(ఎంసిఎ)కు లేఖ రాశాడు. ఈ విషయాన్ని ఎంసిఎ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. "పృథ్వీ షా.. ఎంసిఎ నుంచి నుంచి ఎన్ఓసి కోరాడు. మేము త్వరలో దానిపై నిర్ణయం తీసుకుంటాము" అని సదరు అధికారి పేర్కొన్నారు. 2025 ఐపిఎల్ వేలంలో పృథ్వీ షాను ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేయని సంగతి తెలిసిందే.

ఎంసిఎతో విభేదాలే కారణమా..?

కొంత కాలంగా ముంబయి క్రికెట్ అసోసియేషన్‌తో పృథ్వీ షా విబేధాలు తలెత్తాయి. అందుకు ప్రధాన కారణం అతడిని జట్టు నుంచి తప్పించడమే. ఫిట్‌నెస్ సరిగా లేకపోవడంతో గతేడాది రంజీ ట్రోఫీ జట్టు నుంచి అతడిని ముంబయి సెలక్టర్లు పక్కన పెట్టారు. షా శరీరంలో అధికంగా ఫ్యాట్ ఉందని, బరువు ఎక్కువగా ఉన్నాడని ముంబయి టీం మెనేజ్‌మెంట్ సెలక్టర్లకు ఫిర్యాదు చేసింది. టీం మేనేజ్‌మెంట్ ఫిర్యాదు మేరకు అతడికి రెండు వారాల ప్రత్యేక ఫిట్‌నెస్ ప్రోగ్రామ్‌ను ఎంసిఎ సిఫార్సు చేసింది. కానీ సెలక్టర్లు ఆశించినంత ఫిట్‌నెస్‌ను షా సాధించలేకపోయాడు. దీంతో గతేడాది డిసెంబర్‌లో జరిగిన విజయ్ హాజారే ట్రోఫీలో కూడా షా భాగం కాలేదు. ఈ క్రమంలోనే ఎంసిఎతో పృథ్వీషా తెగదింపులు చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. పృథ్వీ షా ఇప్పటివరకు ముంబయి జట్టు తరపున 58 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడి 4556 పరుగులు చేశాడు. 65 లిస్ట్–ఎ, 117 టి20ల్లో ముంబయికి ప్రాతినిథ్యం వహించాడు.

ఐపిఎల్ విజయోత్సవ వేడుకలకు బిసిసిఐ కొత్త మార్గదర్శకాలు

ముంబయి : భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బిసిసిఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ఐపిఎల్ విజయోత్సవాలకు మార్గదర్శకాలను జారీ చేసింది. ఐపిఎల్ సీజన్–18 విజేత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సిబి) విజయోత్సవాల్లో 11మంది అభిమానులు మృతిచెందిన దృష్ట్యా.. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా కఠిన నిబంధనలు తీసుకొచ్చింది. ఐపిఎల్ విజేతలు సెలబ్రేషన్స్‌కు తప్పనిసరిగా ఈ నిబంధనలను పాటించాల్సిందేనని ప్రకటించింది. ఈ విషయాన్ని బోర్డు సెక్రెటరీ దేవజిత్ సైకియా సోమవారం వెల్లడించారు. అలాగే తొక్కిసలాట ఘటనను బిసిసిఐ తీవ్రంగా పరిగణి స్తోందని వెల్లడించారు.

కొత్త మార్గదర్శకాలు..

- టైటిల్ గెలిచిన 3 నుంచి 4 రోజుల తర్వాతే సెలబ్రేషన్స్ చేసుకోవాలి.
- ఏదైనా వేడుకను నిర్వహించడానికి ముందు జట్లు బిసిసిఐ నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలి.
- బోర్డు నుంచి ముందస్తు లిఖిత పూర్వకమైన అనుమతి లేకుండా ఈవెంట్‌లను నిర్వహించకూడదు.
- నాలుగు అంచెల భద్రత తప్పనిసరి.
- అన్ని వేదికల వద్ద, రవాణా సమయంలో మల్టీ లేయర్డ్ సెక్యూరిటీ ఉండాలి.
- జిల్లా పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక అధికారుల నుంచి అనుమతి పొందాలి.
- ఈవెంట్ షెడ్యూల్ అంతటా ఆటగాళ్లకు, సిబ్బందికి రక్షణ కల్పించాలి.
- ఎయిర్‌పోర్టు నుంచి ఈవెంట్ వేదిక వరకు భద్రత ఉండాలి.
- వేడుకలు చట్టబద్ధంగా, సురక్షితంగా కొనసాగడానికి పౌర, చట్టాన్ని అమలు చేసే సంస్థలు అనుమతి ఇవ్వాలి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68